సూర్య సేన

Estd: 2023

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

RNI.No.: TELTEL/2023/85598

www.sooryasena.com



ఆదివారం SUNDAY || 08.11.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 4 సంచిక (Issue) : 61 || పేజీలు (Pages) : 10 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah

ఒక్క అడుగు నుంచి ముఖ్యమంత్రి పీఠం వరకు..

ఎనెన్నో ఒడిదొడుగులను అధిగమిస్తూ సాగిన ముఖ్య మంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం



హైదరాబాద్, నవంబర్ 08 (సూర్య సేన): సాధారణ రాజకీయ కార్యకర్తగా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి, స్థానిక సంస్థల ప్రతినిధిగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా వివిధ బాధ్యతలు సమవర్ధగా నిర్వహించి నేడు తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నాయకుడు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి రాజకీయ ప్రస్థానం అనేక మలుపులు, సవాళ్లు, విజయాలు, అపజయాలు, ఓటములతో సాగింది. నవంబర్ 8న ఆయన జన్మదినం సందర్భంగా ఆ ప్రయాణాన్ని ఒకసారి గుర్తుచేసుకోవడం ప్రత్యేకం. 1969 నవంబర్ 8న ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లా, అప్పటి మహబూబ్ నగర్ జిల్లా కొండారెడ్డిపల్లి గ్రామంలో రామచంద్రమ్మ దంపతులకు జన్మించిన్నారు. హైదరాబాద్ లోని ఏవీ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. 2006లో మిడ్జిల్ మండలం నుండి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా గెలవడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2007లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజకీయాల్లో ఎదుగుదలతో పాటు ఎదురుదెబ్బలు కూడా ఆయన ప్రయాణంలో భాగమయ్యాయి. 2017లో తెలుగుదేశం పార్టీని వీడి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో కొడంగల్ శాస నమండలి సభ్యుడిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయితే ఆ ఓటమితో రాజకీయ ప్రస్థానానికి విరామం ఇవ్వకుండా ముందుకు సాగారు. 2019 జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాగిరి లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘనవిజయం సాధించి. డిల్లీ పార్లమెంట్ లో అడుగుపెట్టారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీని ప్రజల్లోకి బలమైన శక్తిగా తీసుకెళ్లారు.

2వ పేజీ లో...

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన

సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి



అమరావతి, హైదరాబాద్, నవంబర్, 7 (సూర్యసేన ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల ప్రజలకు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఇరువురు నేతలు ఓ ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంప దలు వెల్లివిరియాలని అభిలాషించారు. ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని కోరుకున్నారు. మనం వెలిగించే దీపం మన ఇంటికేకాదని, సమాజానికీ వెలుగునివ్వాలని ఆకాంక్షించారు. సాటివారి జీవితాల్లో సంతోషాన్ని నింపేలా పండుగలో భాగం కావాలని ముఖ్యమం త్రి పిలుపునిచ్చారు. ఐకమత్యం, పరస్పర సహకారంతో మనమంతా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. దీపావళి వెలుగులు ప్రతి ఇంటా సుఖసంతోషాలు నింపాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రజల జీవితాల్లోని చీకట్లను తొలగించి, వారి బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్నివర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగకు విశిష్టమైన ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు.దీపాల వెలుగులతో ఇళ్లను, పరిసరాలను అలంకరించుకుని రాష్ట్ర ప్రజలంతా ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!

- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్

- ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం- ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ- రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన- గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు



కొడంగల్, నవంబర్, 7 (సూర్యసేన ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళు ్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు.

మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు.

బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు

దీపావళి వేళ కాంగ్రెస్ నేతలకు గుడ్‌న్యూస్..

నామినేటెడ్ పోస్టులపై కీలక ప్రకటన



హైదరాబాద్, నవంబర్, 7 (సూర్యసేన ప్రతినిధి): రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వెల్లడిం చారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవుల భర్తీకి సంబంధించి ప్రస్తుతం తీవ్ర కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలపై పూర్తి వివరాలను సేకరించి అధిష్టానానికి నివేదిక అందజేసినట్లు ఆయన తెలిపారు.గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు.. ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ నిఘా – పనితీరు ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గతంలో ఉన్నట్లు లేదని, నాయకులు, మంత్రుల పనితీరును పర్యవేక్షించ డానికి ఏఐసీసీ స్థాయిలో పెద్ద వ్యవస్థే పని చేస్తోందని తెలిపారు. కనీసం మూడు రోజులు పార్టీ కార్యక్రమాల నివేదిక ఢిల్లీకి వెళ్లకుంటే వెంటనే అక్కడి నుంచి మెసేజ్ వస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తున్నారని మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సిబ్బందితో కలసి

రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దీపావళి వేడుకలు..!



న్యూఢిల్లీ, నవంబర్, 7 (సూర్యసేన ప్రతినిధి): రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భారత వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. పశ్చిమబెంగాల్ లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ఆయన ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో

పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు

- మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా, నవంబర్, 7 (సూర్యసేన ప్రతినిధి): దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్వ్ ఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో 'మన ఇందిరమ్మ ఇళ్ల'ల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యజమాని పొన్నం కోమల, సమ్మయ్య ముదిరాజ్ కుటుంబానికి బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి, మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీపావళి సందర్భంగా లబ్ధిదారుడి ఇంట్లో క్రాకర్స్, బాణాసంచా కాల్చి పండుగను చేసుకున్నారు. ఈ సంద ర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు జరుపుతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు.

ఒక్క అడుగు నుంచి ముఖ్యమంత్రి పీఠం వరకు..

ఎనెన్నో ఒడిదొడుగులను అధిగమిస్తూ సాగిన ముఖ్య మంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం



హైదరాబాద్, నవంబర్ 08 (సూర్య సేన): సాధారణ రాజకీయ కార్యకర్తగా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి, స్థానిక సంస్థల ప్రతినిధిగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా వివిధ బాధ్యతలు సమవర్ధగా నిర్వహించి నేడు తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నాయకుడు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి రాజకీయ ప్రస్థానం అనేక మలుపులు, సవాళ్లు, విజయాలు, అపజయాలు, ఓటములతో సాగింది. నవంబర్ 8న ఆయన జన్మదినం సందర్భంగా ఆ ప్రయాణాన్ని ఒకసారి గుర్తుచేసుకోవడం ప్రత్యేకం. 1969 నవంబర్ 8న ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లా, అప్పటి మహబూబ్ నగర్ జిల్లా కొండారెడ్డిపల్లి గ్రామంలో రామచంద్రమ్మ దంపతులకు జన్మించిన్నారు. హైదరాబాద్ లోని ఏవీ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. 2006లో మిడ్జిల్ మండలం నుండి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా గెలవడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2007లో శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజకీయాల్లో ఎదుగుదలతో పాటు ఎదురుదెబ్బలు కూడా ఆయన ప్రయాణంలో భాగమయ్యాయి. 2017లో తెలుగుదేశం పార్టీని వీడి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో కొడంగల్ శాసనమండలి సభ్యుడిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయితే ఆ ఓటమితో రాజకీయ ప్రస్థానానికి విరామం ఇవ్వకుండా ముందుకు సాగారు. 2019 జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాగిరి లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఘనవిజయం సాధించి. డిల్లీ పార్లమెంట్ లో అడుగుపెట్టారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి పార్టీని ప్రజల్లోకి బలమైన శక్తిగా తీసుకెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నుంచి ముఖ్యమంత్రి బాధ్యతల వరకు



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తూ 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి నాయకత్వం వహించారు. ఆ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడంతో శాసనసభా పక్ష నాయకుడిగా ఎంపికైన ఆయన, 2023 డిసెంబర్ 7న తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడిగా మొదలైన ప్రస్థానం రాష్ట్ర అత్యున్నత కార్యనిర్వాహక బాధ్యత వరకు చేరడం ఆయన రాజకీయ జీవితంలో కీలక ఘట్టంగా నిలిచింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజా చర్చలో నిలుస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అభివృద్ధి ప్రాధాన్యతలపై ప్రజలు ప్రభుత్వ పనితీరును పరిశీలిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడం ఏ ముఖ్యమంత్రికైనా నిరంతర బాధ్యత.

ప్రజా జీవితంలో మరో మైలురాయి

ఒకప్పుడు స్థానిక స్థాయి నుంచి రాజకీయ ప్రయాణం ప్రారంభించిన రేవంత్ రెడ్డి, అనేక పదవులు చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారు. ఈ ప్రయాణం రాజకీయాల్లో పట్టుదల, ప్రజా జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, విజయాలతో పాటు ఓటములను స్వీకరించి ముందుకు సాగాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. జన్మదినం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా ఆయన బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిద్దాం.... జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సూర్య సేన తెలుగు దినపత్రిక హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తోంది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా ఆయన మరింత ఉత్సాహంతో, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆకాంక్షిస్తోంది..✍

ఇట్లు.. సూర్య సేన తెలుగు దినపత్రిక యాజమాన్యం, సంపాదకవర్గం మరియు సిబ్బంది.



దీపాల వెలుగుల్లో తెలంగాణ.. భక్తి భావంతో దీపావళి సంబరాలు..



చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దీపోత్సవం.. కార్తీక మాస ఆరంభ వేళ ఆధ్యాత్మిక శోభ

హైదరాబాద్, నవంబర్ 07 (సూర్య సేన): చీకటిని తొలగించి వెలుగులు నింపే పండుగ దీపావళి. ప్రతి ఇంటా దీపాల కాంతులు విరజిమ్ముతూ, ప్రతి మనసులో ఆనందం, భక్తి భావాలను నింపే ఈ పర్వదినాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపు కోనున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగకు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం ఉంది. పురాణాల ప్రకారం శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరకాసురుడిని సంహరించిన విజయానికి గుర్తుగా నరక చతుర్దశి జరుపుకుంటారు. అలాగే రావణ సంహారం అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారనే కథనం కూడా దీపావళి పండుగతో ముడిపడి ఉంది. ఈ పర్వదినాన లక్ష్మీదేవిని పూజించడం ద్వారా ఇంటికి సిరిసంపదలు, సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. తెలంగాణలో దీపావళి వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా సాగుతాయి. పండుగకు ముందుగానే ఇళ్లను శుభ్రం చేసి, ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి, గుమ్మాలకు మామిడి తోరణాలు కడతారు. సాయంత్రం వేళ ఇళ్ల ముందు, తులసి కోట వద్ద మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి పిండి వంటలు, మిఠాయిలు పంచుకుంటూ పండుగ ఆనందాన్ని ఆస్వాదిస్తారు. బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయతను పంచుకుంటారు.



కార్తీక మాస పవిత్రతకు స్వాగతం

దీపావళి అనంతరం ప్రారంభమయ్యే కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసంగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలో తెల్లవారుజామున పవిత్ర స్నానాలు ఆచరించడం, ఆలయాలను దర్శించుకోవడం, శివాలయాల్లో దీపాలు వెలిగించడం, తులసి పూజ, వనభోజనాలు వంటి ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. కార్తీక పౌర్ణమి వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారుతాయి. భక్తులు ఉపవాసాలు, వ్రతాలు, ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక జీవనానికి ప్రాధాన్యం ఇస్తారు.

ప్రతి ఇంటా ఆనందం.. ప్రతి గుండెలో వెలుగు

దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం, సంబరాలు జరుపుకోవడం మాత్రమే కాదు. మనలోని అహంకారం, ద్వేషం, అసూయ వంటి చీకట్లను తొలగించి ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వం అనే వెలుగులను నింపుకోవాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందంగా పండుగ జరుపుకోవాలనే స్ఫూర్తిని చాటుతుంది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి దీపాలకు ప్రాధాన్యం ఇవ్వడం, శబ్ద కాలుష్యాన్ని తగ్గించడం, పండుగను ప్రశాంతంగా జరుపుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ దీపావళి పర్వదినం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు నింపాలని, కార్తీక మాసం ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించాలని ఆకాంక్షిద్దాం. తెలంగాణ ప్రజలందరికీ, భక్తజనులకు దీపావళి మరియు కార్తీక మాస శుభాకాంక్షలు.

దీపావళి నోము మనోబలానికి సంకల్పం

ఏ పని తలపెడుతున్నామో అది పూర్తయ్యేంతవరకు మనలో సంకల్పం బలంగా ఉండాలి' అంటారు పెద్దలు. కుటుంబ శ్రేయస్సుకు తపించే మనసుకు తగినంత బలం అందాలంటే అందుకు దైవ శక్తి కూడా తోడవ్వాలి అనేది పండితుల వాక్కు. అందుకే, అనాది నుంచి కుటుంబ క్షేమం కోసం చేసే దైవారాధనలలో నోములు, వ్రతాలు మన జీవనంలో ఓ భాగమయ్యాయి. వాటిలో కొన్ని ప్రాంతాలలో దీపావళి రోజున చేసుకునే కేదారేశ్వర వ్రతం (నోము)కు విశేష ప్రాముఖ్యత ఉంది.

ఈ నోమును సాక్షాత్తు పార్వతీదేవే నోచిందని, పరమేశ్వరుడి అనుగ్రహం పొందిందని పురాణోక్తి. గౌతమ మహర్షి చెప్పిన విధి విధానాలను అనుసరించి పార్వతీ దేవి కేదారేశ్వర వ్రతాన్ని ఆశ్వీయుజ మాసంలో శుక్లపక్షంలో అష్టమినాడు మొదలుపెట్టి అమావాస్య వరకు ఆచరించినట్టుగా చెబుతారు. ఈ వ్రతాన్ని స్త్రీలు చాలా వరకు దీపావళి అమావాస్య రోజున ఉపవాస దీక్షతో భక్తిశ్రద్ధలతో గౌరీ సమేత కేదారేశ్వరుడిని పూజించి, ఆ ఆది దంపతుల కృపను పొందుతుంటారు.



కల్పవల్లి.. పాలవెల్లి..

పీఠం మధ్యన ధాన్యరాశిని పోసి, అందులో పూర్ణకుంభాన్ని ఉంచి, ఇరవై ఒక్క దారాలతో సూత్రాన్ని చుట్టి, గంధ పుష్పాక్షతలను ఉంచాలి. పీఠానికి పై భాగాన మామిడి ఆకుల తోరణాలు, పూలతో అలంకరించిన పాలవెల్లిని అమర్చుకోవాలి. పసుపు గౌరి, పసుపు గణపతి. జాకెట్టు ముక్క, నోము దండ, 21 తమల పాకులు, 21 నల్ల పోకలు, 21 ఖర్జూర పండ్లు. వత్తిపత్తి, పసుపు, కుంకుమ, 2 ఎండుకొబ్బరి చిప్పలు, 2 కొబ్బరికాయలు, హారతి కర్పూరం, కంకణం(చేతికి కట్టుకునే తోరం), ధూప, దీప, నైవేద్యాలు సిద్ధం చేసుకోవాలి.

గౌరీ తనయుడితో ఆరంభం..

ముందుగా గణాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుడి (పసుపు గణపతిని) ప్రార్థనతో పూజ ప్రారంభించాలి. ఆ తర్వాత ఆచమనం చేసుకొని, సంకల్పం చెప్పుకోవాలి. కేదారేశ్వరుని ధ్యానం, ఆవాహనం, ఆసనం, అర్ఘ్యం, పాద్యం, ఆచమనీయం, పంచామృతస్నానం, స్నానం, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, అక్షతలు, పుష్పాలతో షోడశోపచార పూజ చేయాలి. ఆ తర్వాత అథాంగపూజ, అష్టోత్తర శతనామ పూజ, అధసూత్ర గ్రంధిపూజ చేసి శ్రీ కేదారేశ్వర వ్రత కథ విని, బ్రాహ్మణులు, పెద్దల ఆశీర్వచనం తీసుకుంటారు. ఆ తర్వాత తీర్థప్రసాదాలు తీసుకొని ఉపవాస దీక్షను విరమిస్తారు. అమ్మవారి ప్రతిరూపాలుగా భావించే నోముదండలను మెడలో ధరించి, పసుపు, కుంకుమ, పండు, ఆకు, వక్కలను ముత్తైదువులకు వాయినంగా ఇవ్వడంతో నోము పూర్తవుతుంది.

మరుసటి ఏడాది దీపావళి నోము వరకు తమ ఇంట కేదారేశ్వరుని అనుగ్రహంతో ఆయురారోగ్య, సౌభాగ్య, ఐశ్వర్యాభివృద్ధి మెండుగా కలుగుతుందన్న నమ్మకమే కొండంత అండగా భక్తులు తమ జీవనప్రయాణాన్ని కొనసాగిస్తారు.
సర్వేజనా సుఖినోభవంతు!

దీపావళి పండుగ మనకు ఇచ్చే సందేశం

- చీకటిపై వెలుగు విజయం సాధిస్తుంది.
- చెడుపై మంచి విజయం సాధిస్తుంది.
- అబద్ధంపై సత్యం గెలుస్తుంది.
- అజ్ఞానంపై జ్ఞానం విజయం సాధిస్తుంది.
- ప్రేమ, దయ, ఐక్యతతో జీవించాలి.



సంపాదకీయం

ఆదివారం, నవంబర్ 8, 2026

డేటా సెంటర్లు వెర్సస్ డెమోక్రాట్లు

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డేటా సెంటర్ల సమస్య కూడా ముఖ్యమైన అంశంగా మారింది. ముఖ్యంగా డెమోక్రాట్లు ఈ సెంటర్ల నిర్మాణాన్ని, విస్తరణను ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. దీనికి కారణం ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కంపెనీలకు అవసరమైన భారీ విద్యుత్, నీటి వినియోగం, ప్రజల కరెంట్ బిల్లుల భారం విపరీతంగా పెరగడం, పర్యావరణ సమస్యలు ఇవన్నీ తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. అయితే డేటా సెంటర్లకు డెమోక్రాట్లు అందరూ వ్యతిరేకం కాదు. ఈ విషయంలో రెండు వర్గాల వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు తాత్కాలికంగా నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేయాలని కోరుతుండగా, మరి కొందరు కఠినమైన నిబంధనలతో నిర్మించుకోవచ్చని అంటున్నారు. డేటా సెంటర్ అంటే వేలాది కంప్యూటర్లు, సర్వర్లు ఒకే భవనంలో లేదా భారీ క్యాంపస్‌లో ఉండే ప్రదేశం. చాట్ జిపిటి వంటి ఎఐ సేవలు, గూగుల్ సెర్చ్, యుట్యూబ్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఆప్లికేషన్ ఇవన్నీ డేటా సెంటర్లను ఉపయోగిస్తుంటాయి. ఉదాహరణకు చాట్ జిపిటిలో మనం ఒక ప్రశ్న అడిగితే సమాధానం ఇవ్వడానికి డేటా సెంటర్ల లోని సర్వర్లు పనిచేస్తాయి. ఇప్పుడు ఎఐ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. అందుకే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఓపెన్ ఎఐ వంటి సంస్థలకు భారీ డేటా సెంటర్లు అవసరమవుతున్నాయి. డేటా సెంటర్లను వ్యతిరేకించడానికి ఆరు ముఖ్యమైన కారణాలు కనిపిస్తున్నాయి. 1. విద్యుత్ వినియోగం చాలా ఎక్కువ. ఒక పెద్ద ఎఐ డేటా సెంటర్ వేలాది లేదా లక్షలాది ఇళ్లకు అవసరమయ్యేంత విద్యుత్‌ను వాడుకునే పరిస్థితి ఉంటుంది. దీనివల్ల విద్యుత్ డిమాండ్ పెరిగి, కొత్త పవర్ ప్లాంట్లు నిర్మించాల్సి వస్తుంది.ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. 2. ఆ ఖర్చంతా వినియోగదారుల బిల్లులపై విద్యుత్ కంపెనీలు మోపితే సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఆలోచించాల్సిందే. ఉదాహరణకు ఒక కుటుంబం నెలకు 150 డాలర్ల వరకు విద్యుత్ బిల్లును చెల్లిస్తుందని అనుకుందాం. కొత్త డేటా సెంటర్ వల్ల గ్రిడ్ విస్తరణ ఖర్చు పెరిగి ఆ ఖర్చులో కొంత భారం వినియోగదారులపై పడితే బిల్లు అమాంతంగా పెరిగిపోతుంది. అందుకనే జనవరిలో అమెరికా కాంగ్రెస్ సభ్యులు రాబ్ మెనెండెజ్, ఫ్రైస్ యాక్టు ప్రకారం గ్రిగ్ కేసర్ డేటా సెంటర్లు తాము వినియోగించే విద్యుత్‌ను తామే స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలని ప్రతిపాదించడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. 3. ఇక నీటి వినియోగాన్ని పరిశీలిస్తే డేటా సెంటర్ల సర్వర్లు వేడెక్కుతుంటాయి. వాటిని చల్లార్చడానికి పెద్ద మొత్తంలో నీటిని వినియోగించక తప్పదు. దీనివల్ల స్థానికంగా నీటి కొరత ఏర్పడడమే కాకుండా వ్యవసాయానికి నీటి లభ్యత తగ్గుతుంది. 4. పర్యావరణ కాలుష్యం విషయానికి వస్తే డేటా సెంటర్లకు నిరంతరం విద్యుత్ అందించవలసి ఉంటుంది. ఆ విద్యుత్ బొగ్గు, సహజవాయువు వంటి ఇంధనాల ద్వారా ఉత్పత్తి అయితే కర్బన్ ఉద్గారాలు పెరిగి వాయు కాలుష్యం కమ్ముకొస్తుంది. వాతావరణ మార్పులపై ప్రభావం ఉంటుంది. హరిత ఇంధనం లక్షాలు దెబ్బతింటాయి. అందుకే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే డెమోక్రాట్లు, పునరుత్పాదక ఇంధనాన్ని ఉపయోగించాలని కోరుతున్నారు. 5. ఉద్యోగాల సమస్య.. డేటా సెంటర్ల కంపెనీలు ఒక ప్రాంతంలో పెట్టుబడి పెడితే వేలాది ఉద్యోగాలు వస్తాయని చెబుతాయి. కానీ నిర్మాణ సమయంలో చాలా ఉద్యోగాలు లభించినా, డేటా సెంటర్ నిర్మాణం పూర్తయిన తరువాత నిర్వహణకు తక్కువ మంది ఉద్యోగులు మాత్రమే సరిపోతారు. భారీ పెట్టుబడికి తగ్గట్టు శాశ్వత ఉద్యోగాలు స్థానికులకు రావడం లేదని డెమోక్రాట్లు ప్రశ్నిస్తున్నారు. ప్రజల భూమి, నీరు, విద్యుత్ వనరులను వినియోగించుకుంటూ ఆయా కంపెనీలు బిలియన్ డాలర్లు సంపాదిస్తున్నారు తప్ప స్థానికులకు వారి నుంచి ఏ ప్రయోజనం లభిస్తుందని డెమోక్రాట్లు నిలదీస్తున్నారు. ఆరవ అంశం.. అమెరికాలో కొన్ని రాష్ట్రాలు మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలను ఆకర్షించడానికి డెటా సెంటర్ల పెట్టుబడులకు పన్ను రాయితీలు కల్పిస్తున్నాయి. దీనివల్ల కంపెనీలకు భారీ ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది తప్ప ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఆదాయం తగ్గుతుందని డెమోక్రాట్లు విమర్శిస్తున్నారు. ఆ ప్రయోజనాలకు తగిన స్థానిక ఉద్యోగాలు, ప్రజా ప్రయోజనాలు సిద్ధిస్తున్నాయా? అన్నదే ప్రధాన సమస్య. కొంతమంది డెమోక్రాట్లు ఆ పన్ను రాయితీలను తగ్గించాలని కోరుతున్నారు. మొత్తం మీద డేటా సెంటర్ల నిర్మాణంపై రిపబ్లికన్లలో కూడా వ్యతిరేకత కనిపిస్తోంది. ఇప్పుడు డెమోక్రాట్ల ఒత్తిడి వల్ల డేటా సెంటర్ల నిర్మాణంపై కఠినమైన నిబంధనలు వస్తే కొత్త డేటా సెంటర్ల నిర్మాణం ఆలస్యం కావచ్చు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి సంస్థల పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయి. ఈ సంస్థలు విద్యుత్ కోసం స్వంతంగా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవలసి వస్తుంది. నీటి వినియోగానికి వస్తే కొత్త కూలింగ్ టెక్నాలజీలు అవసరమవుతాయి. ఎఐ సౌకర్యాల విస్తరణ వేగం తగ్గుతుంది. ఈ ప్రభావం భారత్ లోని హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో డేటా సెంటర్ల పెట్టుబడులు పెరగడానికి దోహదం చేస్తుంది. డెమోక్రాట్లు లేవనెత్తిన సమస్యలన్నీ భారత దేశంలో కూడా అనుభవ పాఠాలుగా ఉంటాయి. ఈ విషయాలపై భారత్ కూడా ముందుగానే సరైన విధానాలు రూపొందించుకోవలసి వస్తుంది. అయితే డేటా సెంటర్ల నిర్మాణాన్ని పూర్తిగా ఆపడం సరైన పరిష్కారం కాదు.

సూర్య సేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048

డేటా సెంటర్లు వెర్సస్ డెమోక్రాట్లు

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డేటా సెంటర్ల సమస్య కూడా ముఖ్యమైన అంశంగా మారింది. ముఖ్యంగా డెమోక్రాట్లు ఈ సెంటర్ల నిర్మాణాన్ని, విస్తరణను ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. దీనికి కారణం ఎఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కంపెనీలకు అవసరమైన భారీ విద్యుత్, నీటి వినియోగం, ప్రజల కరెంట్ బిల్లుల భారం విపరీతంగా పెరగడం, పర్యావరణ సమస్యలు ఇవన్నీ తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. అయితే డేటా సెంటర్లకు డెమోక్రాట్లు అందరూ వ్యతిరేకం కాదు. ఈ విషయంలో రెండు వర్గాల వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు తాత్కాలికంగా నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేయాలని కోరుతుండగా, మరి కొందరు కఠినమైన నిబంధనలతో నిర్మించుకోవచ్చని అంటున్నారు. డేటా సెంటర్ అంటే వేలాది కంప్యూటర్లు, సర్వర్లు ఒకే భవనంలో లేదా భారీ క్యాంపస్‌లో ఉండే ప్రదేశం.చాట్ జిపిటి వంటి ఎఐ సేవలు, గూగుల్ సెర్చ్, యుట్యూబ్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఆప్లికేషన్ ఇవన్నీ డేటా సెంటర్లను ఉపయోగిస్తుంటాయి. ఉదాహరణకు చాట్ జిపిటిలో మనం ఒక ప్రశ్న అడిగితే సమాధానం ఇవ్వడానికి డేటా సెంటర్ల లోని సర్వర్లు పనిచేస్తాయి. ఇప్పుడు ఎఐ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. అందుకే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఓపెన్ ఎఐ వంటి సంస్థలకు భారీ డేటా సెంటర్లు అవసరమవుతున్నాయి. డేటా సెంటర్లను వ్యతిరేకించడానికి ఆరు ముఖ్యమైన కారణాలు కనిపిస్తున్నాయి.

1. విద్యుత్ వినియోగం చాలా ఎక్కువ. ఒక పెద్ద ఎఐ డేటా సెంటర్ వేలాది లేదా లక్షలాది ఇళ్లకు అవసరమయ్యేంత విద్యుత్‌ను వాడుకునే పరిస్థితి ఉంటుంది. దీనివల్ల విద్యుత్ డిమాండ్ పెరిగి, కొత్త పవర్ ప్లాంట్లు నిర్మించాల్సి వస్తుంది.ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతుంది.

2. ఆ ఖర్చంతా వినియోగదారుల బిల్లులపై విద్యుత్ కంపెనీలు మోపితే సామాన్యుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఆలోచించాల్సిందే. ఉదాహరణకు ఒక కుటుంబం నెలకు 150 డాలర్ల వరకు విద్యుత్ బిల్లును చెల్లిస్తుందని అనుకుందాం. కొత్త డేటా సెంటర్ వల్ల గ్రిడ్ విస్తరణ ఖర్చు పెరిగి ఆ ఖర్చులో కొంత భారం వినియోగదారులపై పడితే బిల్లు అమాంతంగా పెరిగిపోతుంది. అందుకనే జనవరిలో అమెరికా కాంగ్రెస్ సభ్యులు రాబ్ మెనెండెజ్, ఫ్రైస్ యాక్టు ప్రకారం గ్రిగ్ కేసర్ డేటా సెంటర్లు తాము వినియోగించే విద్యుత్‌ను తామే స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలని ప్రతిపాదించడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది.

3. ఇక నీటి వినియోగాన్ని పరిశీలిస్తే డేటా సెంటర్ల సర్వర్లు వేడెక్కుతుంటాయి. వాటిని చల్లార్చడానికి పెద్ద మొత్తంలో నీటిని వినియోగించక తప్పదు. దీనివల్ల స్థానికంగా నీటి కొరత ఏర్పడడమే కాకుండా వ్యవసాయానికి నీటి లభ్యత తగ్గుతుంది.

4. పర్యావరణ కాలుష్యం విషయానికి వస్తే డేటా సెంటర్లకు నిరంతరం విద్యుత్ అందించవలసి ఉంటుంది. ఆ విద్యుత్ బొగ్గు, సహజవాయువు వంటి ఇంధనాల ద్వారా ఉత్పత్తి అయితే కర్బన్ ఉద్గారాలు పెరిగి వాయు కాలుష్యం కమ్ముకొస్తుంది. వాతావరణ మార్పులపై ప్రభావం ఉంటుంది. హరిత ఇంధనం లక్షాలు దెబ్బతింటాయి. అందుకే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే డెమోక్రాట్లు, పునరుత్పాదక ఇంధనాన్ని ఉపయోగించాలని కోరుతున్నారు. 5. ఉద్యోగాల సమస్య.. డేటా సెంటర్ల కంపెనీలు ఒక ప్రాంతంలో పెట్టుబడి పెడితే వేలాది ఉద్యోగాలు వస్తాయని చెబుతాయి. కానీ నిర్మాణ సమయంలో చాలా ఉద్యోగాలు లభించినా, డేటా సెంటర్ నిర్మాణం పూర్తయిన తరువాత నిర్వహణకు తక్కువ మంది ఉద్యోగులు మాత్రమే సరిపోతారు. భారీ పెట్టుబడికి తగ్గట్టు శాశ్వత ఉద్యోగాలు స్థానికులకు రావడం లేదని డెమోక్రాట్లు ప్రశ్నిస్తున్నారు. ప్రజల భూమి, నీరు, విద్యుత్ వనరులను వినియోగించుకుంటూ ఆయా కంపెనీలు బిలియన్ డాలర్లు సంపాదిస్తున్నారు తప్ప స్థానికులకు వారి నుంచి ఏ ప్రయోజనం లభిస్తుందని డెమోక్రాట్లు నిలదీస్తున్నారు. ఆరవ అంశం.. అమెరికాలో కొన్ని రాష్ట్రాలు మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలను ఆకర్షించడానికి డెటా సెంటర్ల పెట్టుబడులకు పన్ను రాయితీలు కల్పిస్తున్నాయి. దీనివల్ల కంపెనీలకు భారీ ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది తప్ప ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఆదాయం తగ్గుతుందని డెమోక్రాట్లు విమర్శిస్తున్నారు. ఆ ప్రయోజనాలకు తగిన స్థానిక ఉద్యోగాలు, ప్రజా ప్రయోజనాలు సిద్ధిస్తున్నాయా? అన్నదే ప్రధాన సమస్య. కొంతమంది డెమోక్రాట్లు ఆ పన్ను రాయితీలను తగ్గించాలని కోరుతున్నారు. మొత్తం మీద డేటా సెంటర్ల నిర్మాణంపై రిపబ్లికన్లలో కూడా వ్యతిరేకత కనిపిస్తోంది.

ఇప్పుడు డెమోక్రాట్ల ఒత్తిడి వల్ల డేటా సెంటర్ల నిర్మాణంపై కఠినమైన నిబంధనలు వస్తే కొత్త డేటా సెంటర్ల నిర్మాణం ఆలస్యం కావచ్చు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి సంస్థల పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయి. ఈ సంస్థలు విద్యుత్ కోసం స్వంతంగా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవలసి వస్తుంది. నీటి వినియోగానికి వస్తే కొత్త కూలింగ్ టెక్నాలజీలు అవసరమవుతాయి. ఎఐ సౌకర్యాల విస్తరణ వేగం తగ్గుతుంది. ఈ ప్రభావం భారత్ లోని హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో డేటా సెంటర్ల పెట్టుబడులు పెరగడానికి దోహదం చేస్తుంది. డెమోక్రాట్లు లేవనెత్తిన సమస్యలన్నీ భారత దేశంలో కూడా అనుభవ పాఠాలుగా ఉంటాయి. ఈ విషయాలపై భారత్ కూడా ముందుగానే సరైన విధానాలు రూపొందించుకోవలసి వస్తుంది. అయితే డేటా సెంటర్ల నిర్మాణాన్ని పూర్తిగా ఆపడం సరైన పరిష్కారం కాదు. భవిష్యత్తులో ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, డిజిటల్ బ్యాంకింగ్.. వీటన్నింటికీ డేటా సెంటర్లు అవసరం అన్నది గుర్తుంచుకోవాలి.

జాగ్రత్త తో ప్రాణాలను కాపాడుకుందాం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ





మోతె, నవంబర్ 07 (సూర్య సేన):

క్యాన్సర్ పై ముందు జాగ్రత్త తో ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెండెం వెంకట రమణ అన్నారు. నవంబర్ 07 న జాతీయ కాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ మాట్లాడుతూ కాన్సర్ పై ప్రతి ఒక్కరు అవగాహన తొ ఉండాలని కోరారు,క్యాన్సర్ అనగా శరీరంలోని కొన్ని కణాలు అసాధారణంగా అదుపు లేకుండా పెరుగుతూ విభజించుకుంటూ ఉండే ఒక వ్యాధి సాధారణంగా మన శరీరంలోని కణాలు ఒక క్రమపద్ధతిలో పెరుగుతాయి, పాత కణాలు చనిపోయి వాటి స్థానంలో కొత్త కణాలు ఏర్పడతాయని చెప్పారు. కాన్సర్ వచ్చినప్పుడు ఈ ప్రక్రియలో మార్పులు ఏర్పడి కణాలు నియంత్రణ లేకుండా పెరుగుతాయని అసాధారణ కణాలు వేగంగా పెరుగుతాయన్నారు కొన్ని సందర్భాల్లో కణాలు గడ్డలుగా ఏర్పడి సమీపంలోని కణజాలాలకు వ్యాపించవచ్చునని రక్తం శోషరస వ్యవస్థ ద్వారా శరీరంలోని ఇతర అవయవాలకు కూడా వ్యాపించవచ్చు నని దీనిని మీటస్టాసిస్ అంటారని కాన్సర్ రకాలు రొమ్ము కాన్సర్ నోటి కాన్సర్ గర్భాశయ ముఖద్వార కాన్సర్ ఊపిరితిత్తుల కాన్సర్ పెద్దపేగు కాన్సర్ ప్రోస్టేట్ కాన్సర్ కాన్సర్ రావడానికి ప్రధాన కారణాలు పొగాకు, గుట్కా ఖైనీ నమలడం. ధూమపానం. మద్యం సేవించడంఅనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు శారీరక శ్రమ లేకపోవడం ఊబకాయం కొన్ని వైరస్ ఇన్ఫెక్షన్ లు అధిక సూర్యరశ్మికి గురికావడంకాన్సర్ నివారణకు ముఖ్యమైన జాగ్రత్తలు పొగాకు మద్యపానానికి దూరంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని ప్రతిరోజూ వ్యాయామం చేయాలని ఆరోగ్యకరమైన బరువు నిర్వహించాలని హెచ్ పి వి బి టీకాలు అవసరమైన వారికి వేయించాలని వయస్సు, ప్రమాద కారకాలను బట్టి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. కాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే, సరైన చికిత్స ద్వారా చాలా రకాల కాన్సర్లను సమర్థవంతంగా నయం చేయవచ్చునని నియంత్రించవచ్చునని చెప్పారు ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల అధికారి డాక్టర్ గాజుల చంద్ర శేఖర్ డాక్టర్ శ్రీనివాసరాజు డాక్టర్ భవాని, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లక్ష్మి నారాయణ, కృష్ణమూర్తి డి పి యం ఒ ఆనంద్ సూపర్ వైజర్స్ జయలక్ష్మి పద్మ హెల్త్ అసిస్టెంట్స్ రాజేంద్ర ప్రసాద్,, రవి ఏ యన్ యం లు ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు విద్యార్థినులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు



నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 07 (సూర్య సేన):

రాష్ట్ర ప్రజలకు జిల్లా ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దీపావళి పండుగ పురస్కరించుకుని ప్రజలందరికీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.అందరి ఇండ్లలో చీకట్లు తొలగిసుఖసంతోషాలు, విజయాలు వెల్లివిరియాలని,లక్ష్మీదేవి కటాక్షంతో ప్రతి కుటుంబం వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పెద్దల సమక్షంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ..సురక్షితంగా,పర్యావరణ హితంగా గ్రీన్ క్రాకర్స్‌తో ఈ దీపావళి వేడుకను జరుపుకోవాలన్నారు.

60 మంది నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా

- రూ.33.55 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 07 (సూర్య సేన):

అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా 60 మంది లబ్ధిదారులకు రూ.33,55,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం నల్గొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందుతోందన్నారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సహాయం అందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

కోరిటికల్ గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ

-పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య





యాదాద్రి/భువనగిరి, నవంబర్ 07 (సూర్య సేన):

మండలం కోరిటికల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచి, రైతులకు, ప్రజలకు ఎలాంటి విద్యుత్ అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై హర్షం

-ఎరుకల సామాజిక వర్గానికి కమిషన్ చైర్మన్ పదవి కల్పించాలి: కుతాడి సురేష

యాదాద్రి/భువనగిరి, నవంబర్ 07 (సూర్య సేన):

తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు దిశగా రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కుతాడి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని తమ సంఘం గత కొంతకాలంగా పోరాటం చేస్తోందని తెలిపారు. తమ చిరకాల డిమాండ్‌ను ప్రభుత్వం గుర్తించి సానుకూల నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లు ఒకే వ్యవస్థలో ఉండటంతో ఆదివాసీ ఎరుకల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుతో గిరిజనుల సమస్యలకు ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసీ ఎరుకల సామాజిక వర్గానికి తగిన గుర్తింపు కల్పించాలని, ప్రత్యేక ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం కల్పించాలని కుతాడి సురేష్ ప్రభుత్వాన్ని కోరారు.



ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు

- నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

సూర్యాపేట నియోజకవర్గ ప్రజలందరికీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో కొనసాగాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు కొప్పుల వేణారెడ్డి పేర్కొన్నారు.



జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి దీపావళి

దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వతమోపహమ్!
దీపేన సాధ్యతే సర్వం సంధ్యాదీపం నమోస్తుతే!!

దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి ఆనందానికి నవ్వుల హరివిల్లులకు సహజత్వసిద్ధికి సద్గుణ సంపత్తికి నిలువెత్తు నిదర్శనంగా తిమిరంతో సమరంగా జ్యోతిర్మయంగా దివ్యతేజస్సుకు నికషోఫలంగా దీపారాధన శ్రీకారం చుట్టుకోవడం పూర్వాచార సదాచార సంపన్నంగా వస్తున్న ఆనవాయితీ. ఆశ్వయుజ బహుళ చతుర్దశి నుండి కార్తీక మాసం పర్యంతం సంధ్యాసమయంలో మట్టిప్రమిదలలో దీపాలను వెలిగిస్తారు. జీవనది, సముద్ర దీపదానాలు విశేష పుణ్యప్రదాయకంగా భాసిలుతున్నాయి. దీపావళి శరదృతువులో అరుదెంచడం ప్రకృతికాంతకు దివ్వెల వెలుగులతో కాగడా పట్టినట్లుగా శోభించడం ఔచితీపోషకమైనది.

అసుర సంహార మోదావళిగా, జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళిగా పరిఢవిల్లిన దీపావళి పండుగ ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడు అఖండ భారతావని పులకించేట్లుగా ఆబాలగోపాలం కడురమ్యంగా, హృదయోల్లాసంగా జరుపుకొనే దివ్వెల పండుగ దీపావళి. దీపావళి అమావాస్యనాడు వచ్చే పెద్ద పండుగ. దీనినే అమావాస్య దివ్వెల పున్నమి అని లోకవ్యవహారంలో జనశ్రుతిలో ఉన్నది. దీపావళి అంటే దీపాల వరుస అనే అర్థం. భారతీయులందరూ కులమతాలకతీతంగా ఆనందడోలికల్లో మునిగితేలే అపూర్వ పర్వమే దీపావళి. భారతీయులు ఈ పండుగను మూడు రకాల కోణాల్లో జరుపుకుంటారు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు లంకాధిపతి అయిన రావణాసురుడిని సంహరించిన పిదప సీతాదేవి సమేతంగా అయోధ్యను చేరి పట్టాభిషిక్తుడైనడని ఉత్తరభారతావనిలో రావణాసురవధ బాణానంచాలను నేత్రవర్షముగా కాలున్నా, పేలున్నా రామలీలమైదానంలో జరుపుకుంటారు. మన తెలుగువారు నరకాసురవధను గుర్తుకు చేసుకుంటూ శ్రీకృష్ణుడు సత్యభామ ద్వారా లోక కంటకుడైన నిరాకాసురుడిని సంహరించిన తీరుతులను మనఃఫలకంపై తళుక్కున మెరిసేట్లుగా స్మృతిపథంలో గుర్తు చేసుకుంటూ గడ్డిలో బాణాసంచాలను గూర్చి పేర్చి నరకాసురుడు బొమ్మను కాల్చడం దుష్టశిక్షణం, శిష్టరక్షణంగా తలుచుకొని తెలుగువారు జరుపుకునే అవధులు లేని ఆనందానికి పరాకాష్టగా నిలిచే అద్భుత సన్నివేశమే దీపావళి పండుగ. శ్రీమహావిష్ణువు వామనవతారంలో బలి చక్రవర్తి నుండి మూడు అడుగుల నేలను యాచించి అతనిని పాతాళానికి అణగదొక్కిన రోజుగా దీపావళి పండుగను మరో కోణంలో జరుపుకోవడం కనిపిస్తుంది.

దీపావళి పండుగ ముచ్చటగా మూడు రోజుల పండుగ. నరక చతుర్దశి, దీపావళి అమావాస్య, బలిపాడ్యమి అని మూడు రోజులు విశేషంగా అభ్యంగనస్నానాలు, పిండివంటలు, బాణాసంచాలు అద్భుత దీపకాంతులతో దీపాలంకరణలతో నిర్మిట్లు గొలిపే విధంగా రమణీయంగా శోభాయ మానంగా దీపాల పండుగ దీపావళి పండుగగా అంబరాన్ని అంటే సంబరాలతో తెలుగునాట కడురమ్యంగా జరుపుకుంటారు. దీనికి తోడు జైనులు ఈ దీపావళి అమావాస్యను నూతన దస్త్రములతో లక్ష్మీదేవి పూజాక్రతువులతో పూజాధికంగా క్రొత్తసంవత్సరం శ్రీకారం చుట్టుకోవడం కొసమెఱుపుగా కానవస్తుంది.

ఈవిధంగా దేశప్రజలందరూ ఆనందోత్సాహాలతో అంబరానంటే సంబరాలతో జరుపుకునే ఈ పండుగ అంతరార్థం ఏమిటంటే... ఈ దీపావళి అమావాన్య మరునటి రోజుననే కార్తీకమానం ప్రారంభమవుతుంది. అంటే చలితో ప్రారంభమవుతుంది. ఇప్పటినుండి రాత్రి పొద్దు ఎక్కువగా అనగా సాయంవేళలో వెనువెంటనే త్వరత్వరగా చీకటి పడడం ఆలస్యంగా పొద్దు పొడుస్తున్న కారణంగా ఆరోగ్య పరిరక్షణార్థం ఉదయాన్నే చల్లనినీటి స్నానం ఆవశ్యం. దీపావళి అమావాస్య నాటి అభ్యంగనస్నానం విశేష ఫలితాన్ని చేకూరుస్తుంది. నువ్వులనూనెలో మహాలక్ష్మీదేవి, నీటిలో గంగాదేవి కొలువై ఉంటారని పురాణ శాస్త్ర వచనం. అట్టి స్నానం వల్ల శరీర రుగ్మతలు వీడి మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉత్సాహము ఉత్తేజంతో ఉండడానికి ఆస్కారం ఏర్పడుతుంది. స్త్రీలు ఇంట్లో రాత్రివూట వెలిగించిన దీపాల వరుసకాంతులు శోభను గూర్చి అఖండంగా లక్ష్మీకళను ఉట్టిపడిస్తాయి. మహాలక్ష్మీ ఆగమనానికి వీలుగా గృహాలంకరణ దీపావళి ప్రత్యేకంగా మిరిమిట్లుగొలుపుతుంది. స్త్రీలు, ఆడపిల్లలు గృహాలలో దీపాలు అలంకరణలలో ఉంటే పురుషులు, పిల్లలు బాణాసంచా కాల్చడంలో నిమగ్నమవుతారు ఇంతటి దీపావళి అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటూ లక్ష్మీదేవి అనుగ్రహం కొరకు లక్ష్మీ పూజలు ప్రతాలను దీపాలు అమావాస్య రోజున నేత్రపర్వంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. తర్వాత రోజున వచ్చే కార్తీక శుద్ధ పాడ్యమి రోజున కేదారేశ్వరస్వామి ప్రతాలు జరుపుకోవడం సదాచారం.

నరకాసురుడిని సంహరించిన మరుసటి రోజు అతని పీడ విరగడైందని భావిస్తూ ఆనందంగా జరుపుకునే పండుగ దీపావళి. చీకటిని పారద్రోలుతూ వెలుగులు విరజిమ్మే పండుగగా విజయానికి ప్రతీకగా శోభిల్లే పండుగ దీపావళి. దీపమాలికల శోభతో వెలుగొందే గృహాంగణాలు, కోలాహల సంబరాలతో సొగసుల సొబగులతో అలారారే ఆబాలగోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండి వంటలు ఘుమఘుమలు, బాణాసంచా చప్పుళ్ళు, దివ్య భవ్య నవ్య హృద్యంగమంగా వెలుగుల సొగసులతో ప్రకాశించే దీపావళి సోయగాలు నేత్రపర్వంగా కనువిందు చేస్తాయి. ప్రతి ఏటా ఈ దీపావళి పండుగ ఆశ్రయిజ అమావాస్య రోజున వస్తుంది. దీపాలు పండుగకు ముందు రోజున ఆశయుజ బహుళ చతుర్దశి వస్తుంది. దీనిని నరక చతుర్దశిగా జరుపుకుంటారు. నరక చతుర్దశి రోజున నరకాసురవధ గుర్తుకు చేసుకుంటూ నరకాసుర గడ్డి బొమ్మలను బాణాసంచాలతో కాల్చి ఆనందం పంచుకుంటారు. మరుసటి రోజు దీపావళి అమావాస్య రోజున శ్రీమహాలక్ష్మి ప్రతాలు, పూజలతో పూజాధికంగా ప్రతి ఇల్లిల్లు శోభిల్లుతుంది. మామిడి ఆకుల ద్వారతోరణాలతో, బంతి చామంతుల తోరణాలతో ప్రతి ఇంటిగుమ్మం కళకళలాడుతుంది. ఆ తర్వాత వచ్చే కార్తీక శుద్ధ పాడ్యమి రోజున కేదారేశ్వరస్వామి ప్రతాలతో గడపగడప ఇల్లిల్లు పూజాగతులతో ప్రతాలతో పునీతమవుతాయి. ఇలాగా ముచ్చటగా మూడు రోజుల పర్యంతం వెలుగులతో అసుర సంహార మోదావళిగా, జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళిగా... దీపాల పండుగ దీపావళి తెలుగునాట ప్రతి ఒక్కరికి, ఇంటింటికి ఆసందాహ్లోదాలను పంచుతుంది.

జీవనసాఫల్యపురస్కారగ్రహీత, సాహితీ చక్రవర్తి తూపురాణి వేంకటకృష్ణమాచార్యులు
తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ జూనియర్ కళాశాల సూర్యాపేట
కరవాణి: 9493755741





లంచమే విధిగా.. అవినీతే ఆదాయంగా

- ప్రజల అవసరాలే కొందరు అధికారులకు సంపాదన మార్గాలు.. తెలంగాణలో ఇటీవల వరుస ఏసీబీ దాడులతో బయటపడుతున్న అవినీతి బాగోతాలు



ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలందించాల్సిన కేంద్రాలు. కానీ కొన్ని చోట్ల సామాన్యుల అవసరాలే అధికారులకు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. హక్కుగా రావాల్సిన పనికి కూడా లంచం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పని చేయాల్సిన అధికారులే డబ్బులు డిమాండ్ చేస్తుంటే సామాన్యుడు ఎవరిని ఆశ్రయించాలి? ప్రజాసేవ చేయాల్సిన బాధ్యతను మరిచి, అధికారాన్ని అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకుంటున్న కొందరి తీరు ఆందోళన కలిగిస్తోంది.తెలంగాణలో ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహిస్తున్న వరుస దాడులు ప్రభుత్వ శాఖల్లో వేళ్లూనుకున్న అవినీతిని మరోసారి బయటపెడుతున్నాయి. నవంబర్ మొదటి వారంలో వెలుగులోకి వచ్చిన ఘటనలతో పాటు అక్టోబర్‌లో నమోదైన కేసులను పరిశీలిస్తే పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లోనూ లంచాల వ్యవహారాలు బయటపడుతున్నాయి. చిన్న మొత్తాల నుంచి కోట్లాది రూపాయల అక్రమాస్తుల వరకు వెలుగులోకి వస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది.

రూ.40 వేల లంచం నుంచి కోట్ల ఆస్తుల వరకు!

ఆదిలాబాద్‌లో పోలీసు అధికారి నిర్వాకం: నవంబర్ 4న బజార్ హత్నూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై జి. రమేష్ ఒక కేసులో ఇరికించకుండా ఉండటంతో పాటు స్వాధీనం చేసుకున్న ఫోన్ తిరిగి ఇచ్చేందుకు రూ.50 వేలు డిమాండ్ చేసి, చివరకు రూ.40 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారే లంచం తీసుకుంటూ పట్టుబడటం బాధాకరం.

రూ.4.75 కోట్ల ఆస్తులు.. మార్కెట్ విలువ రూ.20 కోట్లకు పైనే: నవంబర్ 3న హైదరాబాద్‌లోని మేఫ్మా అదనపు డైరెక్టర్ యాదగిరి రావు నల్లగొంట్లకు సంబంధించిన పది ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అధికారికంగా రూ.4.75 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించగా, వాటి మార్కెట్ విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. 12 ఓపెన్ ప్లాట్లు, రెండు ఫ్లాట్లు, జీ+3 భవనం, 1.8 కిలోల బంగారం, ఫార్చ్యూనర్ కారు తదితరాలు గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది.

ఎరువుల దుకాణం నిర్వహణకూ లంచమేనా?: నవంబర్ 3న సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల వ్యవసాయ అధికారి జి. రమేష్ రూ.20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఎరువుల దుకాణం సజావుగా నడిపేందుకు రూ.30 వేలు డిమాండ్ చేసి, ఇప్పటికే రూ.10 వేలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ.20 లక్షల లంచం.. రెవెన్యూ శాఖలో అవినీతి: అక్టోబర్ 12న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, సర్వేయర్ బటుక శ్రీనివాసులు పసుమాముల భూమికి సంబంధించిన లేఅవుట్ నివేదిక కోసం రూ.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇదే నెలలో మాదన్నపేట ఏఈ రూ.1.20 లక్షలు, కీసర డిప్యూటీ తహశీల్దార్ రూ.5 లక్షల లంచం కేసులతో పాటు బంజారాహిల్స్ ఎస్సై, మిర్చెక్ ఇన్‌స్పెక్టర్‌కు సంబంధించిన కేసులు కూడా వెలుగులోకి వచ్చాయి. ఇంకా బయటకు రానివి ఎన్నో..

ఈ ఘటనలన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. శాఖలు వేరు కావచ్చు.. అధికారులు వేరు కావచ్చు.. కానీ ప్రజల అవసరాలను సొమ్ము చేసుకునే ధోరణి మాత్రం కొన్ని చోట్ల ఒకేలా కనిపిస్తోంది.

జీతాలు తీసుకుంటున్నా.. లంచాల దాహం తీరదా?

ప్రభుత్వ ఉద్యోగులకు నిర్ణీత జీతాలు, భత్యాలు, ఉద్యోగ భద్రత ఉంటాయి. అయినా కొందరిలో అక్రమ సంపాదనపై ఆశ తగ్గడం లేదు. విలాసవంతమైన జీవితం, హోదా ప్రదర్శన, తక్కువ సమయంలో ఎక్కువ ఆస్తులు కూడబెట్టాలనే అత్యాశ అవినీతికి కారణమవుతోంది. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయి వెనుక ఒక కుటుంబం పడే ఇబ్బంది, ఒక రైతు ఎదుర్కొనే నష్టం, ఒక సామాన్యుడి ఆవేదన ఉంటాయనే విషయాన్ని మరిచిపోతున్నారు.ఒక రైతుకు భూమి రికార్డులు కావాలి.. ఒక వ్యాపారికి అనుమతి కావాలి.. ఒక పేద కుటుంబానికి ప్రభుత్వ పథకం అందాలి.. ఒక బాధితుడికి న్యాయం జరగాలి. ఇవన్నీ ప్రభుత్వ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు. కానీ కొన్ని చోట్ల పనులు కావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేననే పరిస్థితి ఏర్పడుతోంది. పని చేయకుండా ఆలస్యం చేయడం, అనవసర అభ్యంతరాలు చెప్పడం, మధ్యవర్తుల ద్వారా లంచాలు వసూలు చేయడం వంటి ఆరోపణలు ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి.

ఏసీబీ దాడులే సరిపోతాయా?

అవినీతిని అరికట్టడంలో ఏసీబీ దాడులు కీలకమైనవి. అయితే లంచం తీసుకుంటూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడంతోనే బాధ్యత పూర్తికాదు. విచారణను వేగంగా పూర్తి చేసి, ఆధారాలు నిరూపితమైన కేసుల్లో చట్టప్రకారం శిక్షలు పడేలా చూడాలి. అక్రమాస్తుల కేసుల్లోనూ దర్యాప్తు పారదర్శకంగా సాగాలి.ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సేవకు నిర్ణీత గడువు ఉండాలి. దరఖాస్తుల స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం కల్పించాలి. మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి, ప్రజలకు నేరుగా సేవలు అందించాలి. నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలి. అదే సమయంలో అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజల మౌనం.. అవినీతికి బలమా?

లంచం అడిగినప్పుడు భయంతోనో, పని ఆగిపోతుందనే ఆందోళనతోనో చాలామంది నోరు మెదపడం లేదు. ఈ మౌనం అవినీతిపరులకు మరింత ధైర్యాన్నిస్తోంది. లంచం అడిగే అధికారులపై ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. తెలంగాణ ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుదారుల భద్రతకు తగిన రక్షణ కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యత.

అవినీతి నిర్మూలన అనేది కేవలం ఏసీబీ ఒక్కటే చేయాల్సిన పని కాదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, ప్రజలు సమష్టిగా బాధ్యత తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన సామాన్యుడికి గౌరవం దక్కాలి. తన హక్కును పొందేందుకు ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేని పరిస్థితి రావాలి.ప్రభుత్వ ఉద్యోగం ప్రజలకు సేవ చేయడానికి ఇచ్చిన బాధ్యత.. అక్రమంగా ఆస్తులు కూడబెట్టేందుకు ఇచ్చిన అధికారం కాదు. లంచం తీసుకుంటూ అధికారి పట్టుబడినప్పుడు అవినీతిపై పోరాటం మొదలవుతుంది. కానీ సామాన్యుడి పని ఒక్క రూపాయి లంచం లేకుండా జరిగినప్పుడే ఆ పోరాటానికి నిజమైన విజయం లభించినట్లు! జి. అజయ్ కుమార్

రైతుల కష్టాన్ని దోచుకుంటున్న మిల్లర్ల సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలి

- వరి ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి

సూర్యాపేట కలెక్టరేట్, నవంబర్ 07 (సూర్య సేన):

జిల్లాలో రైస్ మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతుల వద్ద నుంచి వరి ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి ఆరోపించారు. మిల్లర్ల అక్రమ కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరిపి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారంతెలంగాణ రైతు సంఘం సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ హరి సింగ్‌కు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుత వరి ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొస్తే పలువురు రైస్ మిల్లర్లు పరస్పరం కుమ్మక్కై సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టి పంట పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు అనుగుణంగా ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం తూకం, తేమ శాతం పేరుతో రైతులకు అన్యాయం జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అక్రమ తరుగు, కోతలు లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రత్యేక అధికారులను నియమించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ రైతులను దోపిడీ చేసే మిల్లులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు వీరబోయిన రవి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ జె. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి

- దీపాల కాంతులవలె ప్రతి ఇంటా వెలుగులు నిండాలి- బాణాసంచా పేల్చేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి
- ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు..
- మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని.. దీపాల కాంతులవలె తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులతో నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగగా దీపావళి పండుగను జరుపుకుంటామని.. నరకాసుర వదతో దీపావళి పండుగ జరిగినట్లు.. మన తెలంగాణ లోనూ చీకట్లు తొలగి మళ్లీ అభివృద్ధితో వెల్లివిరియాలన్నారు. అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించి బంగారు తెలంగాణ సాధనలో నూతనోత్తేజంతో ముందడుగు వేయాలన్నారు. అలాగే బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పూజలకు ప్రత్యేకమైన కార్తీక మాసంలో చేసే పూజలు ఫలించాలని ఆయన ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ దీపాలు శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని వార్డుల సమాన అభివృద్ధే లక్ష్యం

- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, 7వ వార్డు కౌన్సిలర్ ఈద ప్రవీణ్



సూర్యాపేట టౌన్, నవంబర్ 07 (సూర్య సేన):

సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పార్టీలకు, ప్రతిపక్ష కౌన్సిలర్లకు ఎలాంటి తేడా లేకుండా అన్ని వార్డులకు సమ ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 7వ వార్డు బిలాల్ మసీదు ప్రాంతంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, సూర్యాపేట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, 7వ వార్డు కౌన్సిలర్ ఈదా ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు దైద రవి, చంటి బాబు, విష్ణు స్వరూప్, పిట్టల నర్సి సైదులు, ఏఈ తిరుమలయ్య, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతాలో రోడ్డు ప్రమాదం... తెలంగాణ ఉద్యమ నేత మాణిక్ ప్రభుకు తీవ్ర గాయాలు

- భార్యకు ఐసీయూలో చికిత్స - ఉబెర్ క్యాబ్ డ్రైవర్ నిర్లక్ష్యం... -అక్రమ పార్కింగ్ ప్రమాదానికి కారణమని ఆరోపణ

- న్యాయం కోసం ప్రధాని మోదీ కి విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 07 (సూర్య సేన):

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, తెలంగాణ ఉద్యమ నాయకుడు మాణిక్ ప్రభు గౌడ్ కోల్‌కతాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన భార్య ఎ.నీరజ కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ కు తరలించారు. ప్రస్తుతం ఆమె కాచిగూడలోని టీఎక్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో మాణిక్ ప్రభు గౌడ్ రెండు కాళ్లకు నరాలు తెగిపోవడంతో పక్షవాతం వచ్చి ప్రస్తుతం మంచాన పడ్డారు. ఈ ఘటనలో న్యాయం జరిగేలా చూడాలని ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రికి, ఉన్నతాధికారులకు, బార్ కౌన్సిల్ కు,ఇతర అధికారులకు విజ్ఞప్తి చేశారు.మాణిక్ ప్రభు గౌడ్ తెలంగాణ ఉద్యమ నాయకుల సంక్షేమ కమిటీకి రాష్ట్ర సలహాదారుగా, ఓల్డ్ సిటీ టీజేఏసీ ఛైర్మన్‌గా, లాల్ దర్వాజ అమ్మవారి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయనకు సంభవించిన ఈ విషాదంపై తెలంగాణ ఉద్యమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.

కోల్‌కతాలో ప్రమాదం ఎలా జరిగింది?

మాణిక్ ప్రభు గౌడ్ కథనం ప్రకారం, తన 60వ పుట్టినరోజు తర్వాత ఆయన గత అక్టోబర్ చివరలో తన భార్యతో కలిసి కాళీమాత అమ్మవారి దర్శనం కోసం కోల్‌కతా వెళ్లారు. అక్కడ వారు ఒక ఉబెర్ గో ఏసీ క్యాబ్‌ను బుక్ చేసుకున్నారు. రాత్రి 7:54 గంటలకు హౌరాలోని బెలానగర్ నుండి క్యాబ్ డ్రైవర్ సుజిత్ కుమార్ నడుపుతున్న డబ్ల్యూబీ07బీ5826 నంబరు గల క్యాబ్‌లో, రాత్రి 9:38 గంటలకు బెల్ఘోరియా వైపు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ఇండికేటర్లు, లైట్లు, లేదా హెచ్చరిక గుర్తులు లేకుండా ఒక వాహనాన్ని ప్రధాన రహదారిపై అక్రమంగా పార్క్ చేయడం,ఉబెర్ క్యాబ్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం కూడా ఈ ప్రమాదానికి కారణమని బాధితుడు మాణిక్ ప్రభు ఆరోపించారు. ఈ ప్రమాదంలో ఆయన భార్య స్నేహ కోల్పోగా, మాణిక్ ప్రభు తీవ్రంగా గాయపడి రెండు



కాళ్లు పక్షవాతానికి గురయ్యాయి.

రూ. 70 వేల నగదు, ఆభరణాలు మాయం

ప్రమాదం జరిగిన సమయంలో తన వద్ద ఉన్న రూ. 70 వేల నగదు బంగారు ఆభరణాలు మాయమయ్యాయని మాణిక్ ప్రభు ఆరోపించారు. ప్రమాదం జరిగినప్పుడు తాను గాయపడి స్నేహ కోల్పోవడంతో, అక్రమంగా పార్క్ చేసిన వాహనం నెంబర్‌ను రాసుకోలేక పోయానని అన్నారు. సీసీటీవీ ఫుటేజ్, ఉబెర్ డ్రైవర్ వాంగ్మూలం ఆధారంగా వాహనాన్ని గుర్తించి, బాధ్యులపై చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

ఐదు రోజుల తర్వాత కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై ఆవేదన

కోల్‌కతాలోని జెనిత్ ఆసుపత్రిలో ఐదు రోజుల పాటు చికిత్స పొందిన తర్వాత కూడా పోలీసులు తన వాంగ్మూలాన్ని నమోదు చేయలేదని, ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆయన ఆరోపించారు. తాము హైదరాబాద్ నుంచి వెళ్ళినందున పోలీసులు స్థానికులతో కుమ్మక్కయ్యారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. నిష్పక్షపాత విచారణ జరిగేలా చూడాలని ఆయన ఉన్నతాధికారులను అభ్యర్థించారు.

వీడియో కాల్ ద్వారా వాంగ్మూలం నమోదు చేయాలి

మాణిక్ ప్రభు గౌడ్ మాట్లాడుతూ, తాను ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో మంచానికే పరిమితమయ్యానని, కోల్‌కతాకు ప్రయాణించే స్థితిలో లేనని అన్నారు. అందువల్ల, తన వాంగ్మూలాన్ని వీడియో కాల్ ద్వారా నమోదు చేయాలని, చట్ట ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన అభ్యర్థించారు. ప్రయాణికుల భద్రతకు ఉబెర్ బాధ్యత వహించాలని, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

పేద ప్రయాణికుల రక్షణ కోసం చట్టాలను మార్చాలి

మాణిక్ ప్రభు గౌడ్ మాట్లాడుతూ, ఈ ప్రమాదం కేవలం తన కుటుంబానికే పరిమితమైన సమస్య కాదని, ఇది దేశవ్యాప్తంగా క్యాబ్‌లలో ప్రయాణించే ప్రజల భద్రతకు సంబంధించిన సమస్య అని అన్నారు. తాను ఒక న్యాయవాది కావడం వల్ల లక్షల రూపాయలు ఖర్చు చేసి తన భార్యకు వైద్య చికిత్స అందించగలిగానని, ఇదే పరిస్థితి ఒక పేద కుటుంబానికి ఎదురైతే ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు.రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య చికిత్స, ఆర్థిక సహాయం, న్యాయ రక్షణ అందేలా చూడాలని, అలాగే ప్రయాణీకుల భద్రతకు సంబంధించిన చట్టాలలో అవసరమైన మార్పులు తీసుకురావాలని ఆయన ప్రభుత్వాలను కోరారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు, బార్ కౌన్సిల్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లు స్పందించి తన కుటుంబానికి న్యాయం అందించాలని మాణిక్ ప్రభు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

టీజేపీ జిల్లా అధ్యక్షుడు షానూర్ బాబా



యాదాద్రి /భువనగిరి, నవంబర్ 07 (సూర్య సేన):

యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి. ఇందిరమ్మ గృహ పథకం: అర్హులైన జర్నలిస్టుల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి ఈ పథకంలో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి. ఆర్థిక ఇబ్బందులు: సొంత ఇళ్లు లేక అనేకమంది జర్నలిస్టులు అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన. సమాజ సేవ: నిరంతరం ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి. సమావేశం వివరాలు: బీబీనగర్ పట్టణ మొహమ్మద్ షానూర్ బాబా (తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు). హాజరైన టీజేఏ బీబీనగర్ మండల అధ్యక్షుడు రెడ్డబోయిన మహేష్, కార్యదర్శి మంచాల అనిల్, సభ్యులు ఇందిరాల శివాజీ, పాముకుంట్ల ఉషా కిరణ్, బింగి చంద్ర శేఖర్ తదితరులు.

ఆంధ్రప్రదేశ్ లో అన్నవరం తెలంగాణలో గడ్డి అన్నవరం

- దేవాలయ కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు

రంగారెడ్డి, నవంబర్ 07 (సూర్య సేన):

శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో రానున్న కార్తీకమాసంలో ప్రతిరోజు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఉదయం ఏడు గంటల నుండి 10 వరకు సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాల నుండి నిర్వహించడం కేవలం 25 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని దేవాలయ కోశాధికారి వక్క లంక శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఏకాదశ రోజులలో మాత్రమే గర్భాలయం ముందు వ్రతాలు హాల్లోకి మార్చడం జరిగిందని భక్తుల దర్శనానికి ఇబ్బంది కలగకుండా భక్తుల కోరిక మేరకు కార్తీక పౌర్ణమి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వ్రతాలు ఉంటాయని ఆరోజు గర్భాలయం ముందు వ్రతాలు ఉండవు అని అన్నారు కార్తీకమాసం మహా శివునికి పంచామృతాలతో అభిషేకం ఉదయం 5:30 కు పూజ ప్రారంభమవుతుందని పూజలు మరియు ప్రతి రోజు సామూహిక రుద్రాభిషేకం అర్చన చేయడం జరుగుతుందని ఈ అభిషేకంలో పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాలని మీ పేరు గోత్రం అలాగే స్వామివారి సేవలో భాగంగా మీరు అంతా పాల్గొనాలని కోరారు పౌర్ణమి రోజు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం అన్న ప్రసాదం సాయంత్రం టిఫిన్ కానీ అన్న ప్రసాదం ఏర్పాట్లు చేయడం జరిగిందని ధన రూపేనా వస్తురూపేనా విరాళాలు ఇచ్చు కార్యాలయంలో సంప్రదించి తగిన రసీదు పొందాలని కోరారు దేవాలయంలో సేవలో పాల్గొనేవారు ఇతర విషయాలను కార్యాలయంలో సంప్రదించాలని కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు కోరారు .ఈ ప్రకటనపై సంతకం చేసిన వారిలో చైర్మన్ దేవర లింగారెడ్డి, ఉపాధ్యక్షులు పాల్దీ శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శి చకిలం రమణయ్య ,కార్యదర్శి భాషాపాక సంతోష్ కుమార్ సంయుక్త కార్యదర్శి కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



ఆడపిల్లల సాధికారతే ముఖ్యం

- ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త, మాత శ్రీ జానకమ్మ

రంగారెడ్డి, నవంబర్ 07 (సూర్య సేన);

యత్ర నార్యంత పూజ్యంతే రమంతే తత్ర దేవతాః స్త్రీలను గౌరవించే సమాజంలోనే ప్రగతి సౌభాగ్యం కనిపిస్తుందని మన సాంస్కృతిక సాంప్రదాయం అది అని, ప్రముఖ న్యాయవాది సామాజికవేత్త మాత శ్రీ జ్ఞానకమ్మ అన్నారు. శనివారం ఆమె మా ప్రతినిధితో మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో స్త్రీకి ఆ గౌరవం మాటలకే పరిమితం కాకుండా బాలికలకు సమాన హక్కులు, రక్షణ, విద్య అవకాశాలు, కల్పించినప్పుడే ఆ సాంప్రదాయానికి నిజమైన సార్థకత చేకూరుతుందని అన్నారు. బాలికల సమస్యలు, వారి హక్కులు, సమాజంలో వారికి దక్కాల్సిన స్థానంపై, అవగాహన పెంచేందుకు ఐక్యరాజ్యసమితి బాలికల దినోత్సవం ఒక ఆత్మ పరిశీలన వేదికగా చేస్తుందని అన్నారు. ఒక బాలుడికి చదువు చెబితే ఆ వ్యక్తి మాత్రమే ప్రయోజకుడు అవుతాడని అదే బాలికకు విద్యాబుద్ధులు నేర్పిస్తే ఆ కుటుంబంతో పాటు, యావత్ సమాజమే, వికసిస్తుందని అన్నారు. విద్యబాలికకు కేవలం అక్షర జ్ఞానం మాత్రమే కాదు అది ఆమె ఆలోచన, స్వేచ్ఛను, ఆర్థిక స్వావలంబన, నాయకత్వ లక్షణాలను అందిస్తుంది అని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో స్త్రీ విద్యావంతురాలు అయితే తన పిల్లల ఆరోగ్యం విద్యాసంస్కారాల పట్ల సంపూర్ణ అవగాహనతో మెలుగుతుందని తద్వారా భావితరం ఆరోగ్యకరమైన పునాదులపై నిలబడుతుందని అన్నారు. బాలికల భవిష్యత్తును చిదిమేస్తున్న అతిపెద్ద సామాజిక రుగ్మత బాల్య వివాహం. యుక్త వయసు రాకముందే పెళ్లి చేయడం వలన బాలికలు చదువుకు దూరం అవ్వడమే కాకుండా చిన్న వయసులోనే తల్లులై తీవ్ర అనారోగ్య సమస్యల బారిన



పడుతున్నారని పేర్కొన్నారు. బాల్య వివాహాలు నిరోధక చట్టం (పిసిఎంఏ 2006) అమ్మాయిలకు 18 ఏండ్లు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరం అని ఈ చట్టం కింద తల్లిదండ్రులు వివాహాన్ని ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులవుతారని అన్నారు. భారత రాజ్యాంగ న్యాయవ్యవస్థ బాలికలు మహిళల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలను రూపొందించాయని పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు బాలికపై జరిగే ఎలాంటి లైంగిక వేధింపులు దాడులను తీవ్ర నేరంగా ఫోక్సు చట్టం 2012 పరిగణించి కఠిన శిక్షలు అమలు చేస్తుందని గృహహింస నిరోధక చట్టం 2005 మహిళలకు గృహహింస నుండి తక్షణ న్యాయ రక్షణ, భద్రత కల్పిస్తుందని దిశా చట్టం ఇతర సత్వర న్యాయనిబంధనలు మహిళలపై జరిగే ఘోర నేరాలను సత్వర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించేందుకు ఉద్దేశించినవని అన్నారు. ఆధునిక సాంకేతికత మహిళల భద్రతకు ఎంతటి బలమైన ఆయుధంగా మారుతుందో మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్ నిరూపించిందని ప్రతి స్మార్ట్ ఫోన్ లోఈ యాప్ ఉండడం ద్వారా బాలికలు మహిళలు నిర్భయంగా సమాజంలో తిరిగే ఆత్మవిశ్వాసం పొందుతారని అన్నారు. బాలికలు వంటింటి కుందేళ్లు కారు,దేశ సరిహద్దులను కాపాడే సైనికులని,అంతరిక్షాన్ని శోధించే శాస్త్రవేత్తలని, దేశాన్ని నడిపించే నాయకులని, స్త్రీలను దైవంగా పూజించనవసరం లేదు, తోటి మనిషిగా గుర్తించి సమాన గౌరవం స్వేచ్ఛ భద్రత ఇస్తే చాలు బాలికల పరిరక్షణ మన అందరి సమిష్టి బాధ్యత అని మాత శ్రీ జానకమ్మ పేర్కొన్నారు.

చీకట్లకు చెక్.. 32వ వార్డులో వెలుగుల జిలుగులు- ప్రధాన వీధుల్లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు.. ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నివేదిత లక్ష్మాది



భానుపురి, నవంబర్ 07 (సూర్య సేన):

సూర్యాపేట పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రధాన వీధుల్లో చీకట్లను తొలగించి వెలుగులు నింపేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మున్సిపల్ పాలకవర్గం పనిచేస్తోందని తెలిపారు. శనివారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 32వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను వార్డు కౌన్సిలర్ కుంభం రాజేందర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని వార్డులోని ప్రధాన వీధిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 32వ వార్డులోని ప్రధాన వీధుల్లో చీకటి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కౌన్సిలర్ తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే అవసరమైన నిధులు మంజూరు చేసి లైట్ల ఏర్పాటు పూర్తి చేశామని వివరించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు నాగుల వాసు, మాచర్ల ప్రసాద్, అయోధ్య భార్గవ్, మణికంఠ, వెంకటేష్, మల్లారెడ్డి, వీరన్న, ఆరోపీలు నాగూర్ బి, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, ఇన్‌స్పైర్ యూత్ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

- పట్టభద్రుల ఆగ్రహానికి ఎన్నికల్లో సమాధానం తప్పదు - కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి తీరుతాం: తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్



సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్ విమర్శించారు. ఉమ్మడి నల్లగొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రుల ఆగ్రహం తప్పదని హెచ్చరించారు. అధికారంలోకి రావడానికి ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో పట్టభద్రుల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, పట్టభద్రుల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించడమే లక్ష్యంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం ఎమ్మెల్సీ ఎన్నిక మాత్రమే కాదని, పట్టభద్రుల ఆత్మగౌరవం, నిరుద్యోగుల భవిష్యత్తు, విద్యార్థుల హక్కులకు సంబంధించిన పోరాటమని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వానికి పట్టభద్రులు తమ ఓటు ద్వారా తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో పట్టభద్రుల సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బారి అశోక్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ, చరణ్, సంపత్, శ్రవణ్, గోపి, చందు, నరేష్, సురేష్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య నిర్వహణ అధ్వానం..

చిన్నారులకు కనీస వసతుల కరువు

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి





నల్గొండ ప్రతినిధి, సెప్టెంబర్ 07 (సూర్య సేన):

నల్గొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, నిర్వహణ లోపాలపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు కార్పొరేటర్లతో కలిసి ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలు, మరియు వార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే పేద, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. మూడు సంవత్సరాల క్రితమే మంజూరైన ఎంఆర్ఐ స్కాన్ సేవలు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో పేద రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సిటీ స్కాన్ సేవలు సక్రమంగా అందడం లేదని, త్రీడీ ఎక్స్‌రే విభాగానికి తాళం వేసి ఉండటాన్ని గమనించి అధికారులను ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎలా అందుతాయని నిలదీశారు.చిన్నపిల్లల విభాగంలో న్యూబార్న్ బేబీ ర్యాప్‌లు అందుబాటులో లేకపోవడంతో అప్పుడే పుట్టిన శిశువులను పాత బట్టల్లో చుట్టి ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ కూడా సరిగా లేదని, గత జనవరి నెలతోనే పాత శానిటేషన్ కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ ఇప్పటివరకు కొత్త కాంట్రాక్టర్‌ను నియమించకపోవడం వల్ల ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని అన్నారు. వెంటనే కొత్త కాంట్రాక్టర్‌ను నియమించి పారిశుధ్య పనులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల కేసులు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిపోతున్నాయని, ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కు కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతోందని కంచర్ల ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య కూడా తగ్గుతోందని పేర్కొంటూ, ఈ అంశంపై అధికారులు సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.తాము ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సుమారు రూ. 35 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణం చేపట్టామని కంచర్ల తెలిపారు. ఇందులో 50 ఐసీయూ పడకలు, 25 డయాలసిస్ పడకలు ఏర్పాటు చేసి పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు.అందించాలనుకున్నామని చెప్పారు. అయితే ప్రస్తుతం ఆ విభాగం నిరుపయోగంగా ఉండటం బాధాకరమని అన్నారు.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రూ. 270 కోట్లతో 42 ఎకరాల విస్తీర్ణంలో నల్లగొండ మెడికల్ కళాశాలను నిర్మించామని, రూ. 45 కోట్లతో నర్సింగ్ కళాశాల, క్రిటికల్ కేర్ విభాగం నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెడికల్ కళాశాలను ప్రారంభించిన సమయంలోనే స్థానిక మంత్రికి ఆసుపత్రి విస్తరణ అవసరాన్ని వివరించినట్లు తెలిపారు. అప్పటికే రూ. 20 కోట్లతో నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, మరో రూ. 250 కోట్లు కేటాయించి 1200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నిలిచిపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.నల్లగొండ జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి ఉన్నతాధికారులు తక్షణమే సమీక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.ఏఎంసీ మాజీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్ నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్ అభిమన్యు శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్. కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్ పెరిక యాదయ్య పేర్ల మల్లీశ్వరి అశోక్,రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కుందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి,బాణావత్ దీప్లా, దొడ్డి రమేష్ గోపగోని స్వాతి రాజశేఖర్... కనగల్ మండల పార్టీ అధ్యక్షులు ఐతగోని యాదయ్య,మాజీ కౌన్సిలర్లు రావుల శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల యాదగిరి భాష పాక హరికృష్ణ, దండంపెల్లి సత్తయ్య మెరుగు గోపి, లతీఫ్,జమాల్ ఖాద్రి, పెరిక కరణ్ జయరాజ్,అశ్వాక్, అష్టల్, శంషుద్దీన్, సింగం లక్ష్మి మిర్యాల యాదగిరి,వజ్జ శ్రీనివాస్,వంటల అవినాష్ అశోక్ రెడ్డికంకణాల వెంకటరెడ్డి కందుల లక్ష్మయ్య, అనిల్ నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

1,500 గ్రాముల గంజాయి స్వాధీనం -- నలుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్ కు తరలింపు

- ఒడిశా సరిహద్దు నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయించేందుకు యత్నం

- గంజాయి రవాణా, విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు: పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య



సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఇందులో భాగంగా సూర్యాపేట రెండవ పట్టణ పోలీసులు 1,500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై రామచంద్ర గౌడ్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం రోజున సాయంత్రం పట్టణంలోని చివ్వెంల రహదారిపై అమ్మ గార్డెన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో పోలీసులను గుర్తించిన ఇద్దరు ప్రధాన నిందితులు పరారయ్యారు. గంజాయి తీసుకునేందుకు అక్కడికి వచ్చిన మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న 1,500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ప్రధాన నిందితులైన బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చేందుకు వెళ్లినట్లు, అరెస్టయిన నలుగురు వారికి డబ్బులు సమకూర్చినట్లు వెల్లడైంది. గంజాయిలో కొంత వినియోగించుకుని, మిగిలినది విక్రయించి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వారు ఈ వ్యవహారంలో పాల్గొన్నట్లు గుర్తించారు.

అరెస్టయిన నిందితులు:

1. రూపాని సందీప్ (20) -- జె.జె. నగర్, సూర్యాపేట.
2. బొద్దు భరత్ (21) -- అన్నదురై నగర్, సూర్యాపేట.
3. పులుసు సాయి విశాల్ గౌడ్ -- వినాయక నగర్, సూర్యాపేట.
4. శీలం శ్రీకాంత్ లింగయ్య (24) -- వెంకటేశ్వర కాలనీ, సూర్యాపేట.

పరారీలో ఉన్న ప్రధాన నిందితులు:

1. బొంత అవినాష్. 2. సోమపంగు నాని వర్ధన్.

పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కేసులో నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి గంజాయి వినియోగం యువత ఆరోగ్యాన్ని, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య హెచ్చరించారు. గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై రామచంద్ర గౌడ్,, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీరాములు, +. వీరయ్య, అజ్జర్ అలీ, రామనర్సయ్య, కానిస్టేబుల్ కొండా రమేష్, చీ. నవీన్ లను పోలీసు అధికారులు అభినందించారు.

కష్టాల్లో ఉన్న సహోద్యోగికి పోలీసుల ఆపన్నహస్తం

- అనారోగ్యంతో చికిత్స పొందుతున్న హోంగార్డు బాలకృష్ణ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

విధి నిర్వహణలోనే కాదు.. సహోద్యోగులు కష్టాల్లో ఉన్నప్పుడు సైతం అండగా నిలుస్తూ సూర్యాపేట జిల్లా పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు బాలకృష్ణ కుటుంబానికి జిల్లా పోలీసు సిబ్బంది ఒక కుటుంబంలా ఏకమై రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఆయనను హైదరాబాద్‌లోని గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ నరసింహ సహోద్యోగుల కష్టసుఖాల్లో ఒక కుటుంబంలా అండగా నిలవాలని పోలీసు సిబ్బందికి పిలుపునిచ్చారు. ఎస్పీ పిలుపుతో స్పందించిన జిల్లా పోలీసు సిబ్బంది తమ వంతు సహకారంగా నగదును సేకరించి రూ.లక్షను బాలకృష్ణ కుటుంబానికి అందజేశారు. ఈ మొత్తాన్ని చివ్వెంల ఎస్సై మహేశ్వర్ బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. విధి నిర్వహణలో పరస్పరం సహకరించుకోవడమే కాకుండా, ఆపద సమయంలోనూ తోటి ఉద్యోగికి అండగా నిలవడం పోలీసు శాఖలోని ఐక్యతకు, మానవీయ విలువలకు నిదర్శనమని ఎస్పీ నరసింహతో పాటు పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల మాటే ప్రాధాన్యం.. బాలల స్నేహపూర్వక జిల్లాగా సూర్యాపేట

- 100 పాఠశాలల్లో 6 వేల మంది విద్యార్థుల అభిప్రాయాల సేకరణ.. 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమం విజయవంతం





సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

సూర్యాపేట జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం మరో ముందడుగు వేసింది. యూనిసెఫ్ సహకారంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన 'లిజనింగ్ టు చిల్డ్రన్ (ఎల్‌టీసీ)' కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన సుమారు 100 పాఠశాలల్లో 6 వేల మంది విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలు, అవసరాలు, సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, గురుకుల, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులతో నిర్వహించిన సమూహ చర్చల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ఆలోచనలు, అభిరుచులు, భవిష్యత్తు ఆశయాలతో పాటు గ్రామాలు, పాఠశాలల్లో ఉండాల్సిన సౌకర్యాలపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తమకు సురక్షితంగా అనిపించే ప్రాంతాలు, అసురక్షితంగా భావించే ప్రదేశాలను గుర్తించి వివరించారు. పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను కూడా ఎలాంటి సంకోచం లేకుండా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పిల్లలకు స్వేచ్ఛాయుతమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి వారి మనసులోని అభిప్రాయాలను తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. పిల్లల భాగస్వామ్యంతో వారి అవసరాలను గుర్తించి, హక్కులను పరిరక్షిస్తూ సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం స్పందిస్తూ.. బాలల స్నేహపూర్వక జిల్లాగా సూర్యాపేటను అభివృద్ధి చేయడంలో పిల్లల అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని పేర్కొంది. ఎల్‌టీసీ కార్యక్రమం ద్వారా సేకరించిన సూచనలు, అభిప్రాయాలను విశ్లేషించి, వాటి ఆధారంగా పిల్లల అవసరాలకు అనుగుణంగా తగిన చర్యలు చేపడతామని వెల్లడించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్షా, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, మహిళా శక్తి హబ్, సఖీ కేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సీఆర్‌పీలు, విద్యాశాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

- పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం.. ఈ నెల 16లోగా సమర్పించాలి: జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు

సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

దివ్యాంగుల అభ్యున్నతి, సాధికారత కోసం విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి పురస్కారాలను అందించనుందని జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు తెలిపారు. డిసెంబర్ 3న నిర్వహించనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి వేడుకల్లో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. దివ్యాంగుల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు, సాధికారతకు విశేష సేవలందించిన ఉత్తమ వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డుల ద్వారా గుర్తింపు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు, సేవకులు, స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పురస్కారాలకు సంబంధించిన దరఖాస్తు నమూనా, మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చని తెలిపారు. అర్హులైన వారు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 16వ తేదీలోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, మహిళా, శిశు , దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కలెక్టరేట్‌లోని జీ-1 గదిలో సమర్పించాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

దీపాల పండుగలో చీకట్లు నింపొద్దు.. భద్రతా నియమాలు పాటించండి -- జిల్లా ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు..కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ





సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ కోరారు. దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేళ ఇతరులకు ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాణాసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలకు కారణమయ్యే పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు, ప్రమాదకరమైన బాణాసంచా వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు. బాణాసంచా కాల్చే ప్రాంతాల్లో తగినంత దూరం పాటించాలని, ముందస్తు జాగ్రత్తగా నీరు లేదా ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చాలని, వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలున్న వారు బాణాసంచా శబ్దాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. నివాస ప్రాంతాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, వాహనాల సమీపంలో బాణాసంచా కాల్చరాదని, కాల్చిన బాణాసంచా అవశేషాలను నిర్లక్ష్యంగా వదిలేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దీపాల వెలుగులతో పండుగను జరుపుకుంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బాణాసంచా విక్రయించే వ్యాపారులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని, అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. విక్రయ కేంద్రాల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే విక్రయాలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు శాఖ ప్రథమ ప్రాధాన్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని కలెక్టర్, ఎస్పీ కోరారు. ప్రజలందరి భాగస్వామ్యంతో దీపావళి పండుగను సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలి: అట్లూరి హరిబాబు



హుజూర్‌నగర్ ప్రతినిధి, నవంబర్ 07 (సూర్య సేన):

దీపావళి పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, వెలుగులు నింపాలని హుజూర్‌నగర్ కాంగ్రెస్ నాయకులు అట్లూరి హరిబాబు, మంజుల ఆకాంక్షించారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పండుగ ప్రతి ఇంటా శాంతి, సిరిసంపదలు, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. ప్రజలంతా భేదభావాలు వీడి ప్రేమ, స్నేహం, సౌభ్రాతృత్వంతో కలసిమెలసి పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, సురక్షితమైన పద్ధతుల్లో పండుగ నిర్వహించుకోవాలని సూచించారు. రాష్ట్రం సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలని వారు అభిలషించారు.



విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి క్రీడల వైపు అడుగులు వేయాలి

-- విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం-జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్






నల్గొండ, నవంబర్ 07 (సూర్య సేన):

నేటి సమాజంలో పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆలోచనలు పెంపొందించడంతో పాటు, వారిని క్రీడల వైపు ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో కలెక్టర్ ఎలెవన్ ఎస్పీ ఎలెవన్ జట్ల మధ్య నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా కలెక్టర్ ఎస్ పి శరత్ చంద్ర పవర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఈ పోటీలో విజయం సాధించిన ఎస్పీ జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధుల్లో నిత్యం ఎంతో బిజీగా ఉండే అధికారులు తమలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు మంచి అవకాశమని అన్నారు. రోజువారీ విధులతో పాటు, అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని , ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకంగా 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు విద్యార్థులు, పిల్లలకు క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ స్నేహపూర్వక మ్యాచ్ నిర్వహించినట్లు చెప్పారు. నేటి పిల్లలు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు అలవాటుపడి తల్లిదండ్రులకు తెలియకుండానే విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, తోటి వారితో మాట్లాడటం, కలిసిమెలిసి ఉండటం తగ్గిపోతోందని అన్నారు. పిల్లల ఆలోచనా విధానం ఆరోగ్యకరంగా ఉండాలంటే వారిని క్రీడల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలో మంచి సందేశం తీసుకెళ్లేందుకు, పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు తమ వంతు సహకారంగా ఈ మ్యాచ్ నిర్వహించినట్లు కలెక్టర్ వివరించారు.12 ఓవర్ల కు జరిగిన ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ కు జిల్లా కలెక్టర్ టాస్ వేయగా ఎస్ పి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్లు ఇరు జట్లకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా, స్వయంగా బ్యాటింగ్, బౌలింగ్ చేసి మాచ్ ను ప్రారంభించి క్రీడాకారులలో స్ఫూర్తిని నింపారు. అనంతరం జరిగిన మ్యాచ్ లో ఎస్పీ జట్టు 118 పరుగులు సాధించి విజయం సాధించగా, కలెక్టర్ జట్టు 107 పరుగులతో రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా బెస్ట్ బౌలర్‌గా ఇరుగు రవి, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా శ్రీరామ్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా హరిబాబు ట్రోఫీలు అందుకున్నారు. విజయం సాధించిన ఎస్పీ జట్టుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని స్నేహపూర్వక క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ,స్థానిక కార్పొరేటర్ సుభాష్ లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్ఆర్ నిధులు 1,80,000 రూపాయలతో ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను ప్రారంభించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, అడిషనల్ ఎస్పీ రమేష్, స్థానిక కార్పొరేటర్ సుభాష్,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ పద్మ బాబుగౌడ్, చీఫ్ మేనేజర్ శ్రీరాములు ఎస్బిఐ కలెక్టరేట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్ సౌమిత,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు .వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, కామెంటేటర్ గిరిబాబు, రెవిన్యూ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు .

ఓటు హక్కు కోల్పోవద్దు.. మరో అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం

- నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు గడువు పొడిగింపు..

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి





సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని నవంబర్ 21వ తేదీలోగా ఫారాలు సమర్పించాలని సూచించారు. శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్--2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్ల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, ద్వంద్వ ఓటరు నమోదు తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు మరోసారి తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని తెలిపారు. ఏ ఒక్క అర్హుడూ ఓటు హక్కుకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టాలని, ఫారాలు అందని అర్హులైన ఓటర్లను గుర్తించి తిరిగి అందజేయాలని సూచించారు. ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ వివరాలు అనుసంధానమైన ఓటర్లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా కూడా ఫారాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద్వ ఓటర్ల వివరాలను (ఏఎన్‌డీడీ) పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఆయా ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడానికి గల కారణాలను కూడా స్పష్టంగా పేర్కొనాలని, ఈ వివరాలను పోలింగ్ కేంద్రాలతో పాటు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని తెలిపారు. చిరునామా మారిన వారు కొత్త చిరునామాకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని, ఒకే చిరునామాలో నివసిస్తున్న వారు గతంలో ఫారం సమర్పించలేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ డిక్లరేషన్ ఇవ్వాలని సూచించారు. సమర్పించిన దరఖాస్తులను సంబంధిత ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారి పేర్లు తుది ఓటరు జాబితాలో చేరేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఎన్నికల సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 20లోగా పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- రూ.30 లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





హుజూర్‌నగర్ ప్రతినిధి, నవంబర్ 07 (సూర్య సేన):

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం హుజూర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి, 'నెక్స్ట్ జనరేషన్ సూర్యాపేట' కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న సివిల్ పనులతో పాటు ప్రధాన, చిన్నపాటి మరమ్మతు పనుల పురోగతిని తనిఖీ చేశారు. పాఠశాల క్రీడా మైదానాన్ని చదును చేసి బేస్‌బాల్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన అన్ని అభివృద్ధి పనులను నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను పాఠాలు చదివించి, పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రతిభ, సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడి నర్సిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్, డీఈ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్

- కుసుమవారిగూడెం చోరీ కేసును ఛేదించిన రూరల్ పోలీసులు.. 305 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం

సూర్యాపేట రూరల్ , నవంబర్ 07 (సూర్య సేన):

సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుసుమవారిగూడెం గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో అంతర్‌జిల్లా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాచపల్లి మహేష్ అలియాస్ రసపల్లి మహేష్ (33)ను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 305 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక వివో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గత ఆగస్టు 10వ తేదీ రాత్రి కుసుమవారిగూడెం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర వైన్‌షాప్ షట్టర్లు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అదే సమయంలో పక్కనే ఉన్న కిరాణా దుకాణం, కూల్‌డ్రింక్స్ షాపుల్లోనూ చోరీ చేసి నగదు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. వైన్‌షాప్ క్యాషియర్ ఫిర్యాదు మేరకు సూర్యాపేట రూరల్ పోలీసులు క్రైమ్ నంబర్ 262/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 7వ తేదీ ఉదయం సూర్యాపేట రూరల్ ఎస్సై ఎం. అనిల్ రెడ్డి, పోలీసు సిబ్బంది జనగాం ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం నాగంపేట గ్రామానికి చెందిన రాచపల్లి మహేష్‌గా గుర్తించారు. విచారణలో కుసుమవారిగూడెం చోరీకి సంబంధించి నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి వెండి గజ్జెలు, గొలుసులు కలిపి సుమారు 305 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు వివో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వేలిముద్రల విభాగం, క్లూస్ టీమ్ ఆధారాల పరిశీలనలో నిందితుడికి గతంలోనూ



పలు చోరీ కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, రామగుండం తదితర ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో అతడిపై 16కు పైగా దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించి నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది ఉమామహేష్, అశోక్, సాయిశంకర్‌లను సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్న కుమార్, రూరల్ సీఐ జి. రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలి

- రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి దీపావళి శుభాకాంక్షలు



హైదరాబాద్, నవంబర్ 07 (సూర్య సేన):

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు సూర్యాపేట జిల్లా ప్రజలకు, ముఖ్యంగా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలన్నారు. దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొంటూ, ప్రజల జీవితాల్లో నూతన ఆశలు, అభివృద్ధి, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు. పండుగను సురక్షిత వాతావరణంలో, పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

జానకమ్మకు ఘన నివాళి.. కుటుంబ సభ్యులకు పరామర్శ

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, దుబ్బాక నర్సింహారెడ్డి



పెన్‌పహాడ్, నవంబర్ 07 (సూర్య సేన):

సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముదిరెడ్డి రంగారెడ్డి, ఎల్లారెడ్డి మాతృమూర్తి కీ.శే. జానకమ్మ మృతి పట్ల నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుబ్బాక నర్సింహారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం పెన్‌పహాడ్ మండలంలోని మాచారం, అనిరెడ్డిగూడెం గ్రామాల్లో జానకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాచారం గ్రామ సర్పంచ్ ఇటికల శ్రీను, మాజీ జెడ్పీటీసీ పిన్నెని కోటేశ్వరరావు, సర్పంచులు మామిడి శోభ శ్రీనివాస్, నన్నెపంగు కలమ్మ, చివ్వెంల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుగులోతు నాగు నాయక్, చెంచల నిఖిల్ నాయుడు, చిట్టిబాబు, హర్ష చౌదరి, పెన్‌పహాడ్ మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదింట వెలిగే తొలి దీపమే.. ఆత్మగౌరవానికి ప్రతీక

- ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వెలుగులు నింపాలి.. పోస్టర్ ఆవిష్కరించిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పోతు భాస్కర్



సూర్యాపేట, నవంబర్ 07 (సూర్య సేన):

పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నిండడం ఎంతో సంతోషకరమని నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగను వారి నూతన గృహాల్లోనే జరుపుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని వైట్ హౌస్‌లో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోతు భాస్కర్‌తో కలిసి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి.. ఊరు వాడా కాంతులు నింపేలా' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్నాళ్లూ గుడిసెల్లో, అద్దె ఇళ్లలో ఎన్నో కష్టాల మధ్య జీవించిన పేద కుటుంబాలకు నేడు సొంతింటిలో దీపం వెలిగించుకునే అవకాశం రావడం ఆనందకరమన్నారు. ఇందిరమ్మ ఇంట్లో వెలిగించే తొలి దీపావళి దీపం కేవలం పండుగకు గుర్తు మాత్రమే కాదని, అది ఆ కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. వారి జీవితాల్లోకి వచ్చిన కొత్త వెలుగుకు నిదర్శనమని అన్నారు. ఈ ఏడాది దీపావళి వేడుకలను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వారి ఇళ్లలోనే జరుపుకోవాలని నాయకులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. తమ పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి దీపాలు వెలిగించి పండుగ సంబరాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఇంట్లో వెలుగులు నిండాలని, ప్రతి ముఖంలో చిరునవ్వు విరియాలని, ప్రతి పేద కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ప్రజా ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ జబ్బార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, దారావత్ వీరన్న నాయక్, ముస్కు రామచంద్రారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, శ్రీ లింగమంతుల దేవస్థానం చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరు వెంకన్న గౌడ్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉట్కూరి దివ్య, సర్పంచులు రేఖ రమణ సతీష్, ఒగ్గు జానకి వెంకన్న, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సాయి, నాయకులు చత్రు నాయక్, నాగు నాయక్, కల్లూరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదింట్లో వెలుగులు నింపిన ఇందిరమ్మ ఇళ్లు.. ఘనంగా దీపావళి వేడుకలు

- కొత్త ఇంట్లో లబ్ధిదారులతో కలిసి పండుగ సంబరాలు.. ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు





నల్లగొండ, నవంబర్ 07 (సూర్య సేన):

పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు వారి జీవితాల్లో ఆనందం నింపడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. శనివారం నల్లగొండ మండలం జీకే అన్నారం గ్రామంలో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం, వారి కుటుంబాల సంతోషం, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన పేర్ల లక్ష్మమ్మ నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంట్లోకి లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ గృహప్రవేశం చేయించారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడంతో తన సొంతింటి కల నెరవేరిందని, తమ కుటుంబానికి ఎంతో అండగా నిలిచిందని లక్ష్మమ్మ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మరో ముగ్గురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలెక్టర్ పరామర్శించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సంఘం నుంచి లక్ష రూపాయల రుణం తీసుకుని ఇల్లు నిర్మించుకున్న రజితతో కూడా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీపావళి పండుగ రోజున జిల్లాలోని ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపాలు వెలిగించి కుటుంబ సభ్యులందరితో కలిసి వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఇంటికి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' స్టిక్కర్‌ను అతికించాలని, కుటుంబ సభ్యులంతా దీపాలు వెలిగించిన ఫొటోలను ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని గ్రామ కార్యదర్శికి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను ఆర్థిక స్థోమతకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. జిల్లాలోని ప్రతి కుటుంబంలో దీపావళి వెలుగులు నింపాలని, అందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ లోకి లాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో యాకూబ్ నాయక్, సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్యసాహసాలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం

- ఘనంగా 76వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్ డే వేడుకలు





నల్లగొండ, నవంబర్ 07 (సూర్య సేన):

విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, ధైర్యసాహసాలను పెంపొందించడంతో పాటు వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధ్యక్షుడు బి. చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 76వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇ. కరుణాకర్ కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు స్కౌట్ స్కార్ఫ్ ధరింపజేశారు. అనంతరం స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో స్కౌట్ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని నిర్వాహకులు సూచించారు. తద్వారా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ సురేష్ గుప్తా, పర్యావరణ ప్రేమికుడు, గైడ్ కెప్టెన్ సుజాత, స్కౌట్ మాస్టర్ శీను నాయక్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్. విమల, సెయింట్ అల్ఫోన్సెస్ హైస్కూల్ స్కౌట్ విద్యార్థులు, కట్టంగూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం గైడ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

సిద్ధిపేట జోలికి వస్తే ఊరుకోం..

సీఎం రేవంత్‌కు హరీష్ రావు ఘాటు కౌంటర్!



సిద్ధిపేట, నవంబర్, 7 (సూర్యసేన ప్రతినిధి): మూడు సార్లు కాదు ముప్పై సార్లు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేట మీద వెంట్రుక కూడ పీక లేదని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ వీ గ్రామ కమిటీల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన సిద్ధిపేట వెటర్నరీ కాలేజీని కొడంగల్ కు తీసుకుపోయి నందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేట విద్యార్థులకు క్షమాపణ చెప్పి సిద్ధిపేటకురావాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రెండు పిల్లర్లు మరమ్మతులు చేసి రైతాంగానికి సాగు నీరు అందించకుండా సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తూ డ్రామాలు ఆడుతున్నాడని మండిపడ్డారు. కన్నెపల్లి వద్ద మోటర్లు అన్ చేసి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ కు నీళు ఇవ్వ వచ్చని చెప్పిన రిటైర్డ్ ఇంజనీర్‌లను మీకు బెల్ట్ ట్రీట్మెంట్ ఇస్తా, జైల్లో వేస్తా అని బెదిరిస్తున్న మూర్ఖుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే ఉద్యమకారులను తూపాకీ తో కాల్చేస్తా అన్న చరిత్ర సీఎం రేవంత్ రెడ్డి దీ అన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవికీ, రెండు సార్లు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టిరుణమాఫీ చేస్తానని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి నేటికి సగం మందికి రుణ మాఫీ చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్, బీజేపీ వాళ్ళు తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్వీ నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టేడియం, ఎస్టీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్, అగ్రికల్చర్ బీఎస్సీ పర్మనెంట్ బిల్డింగ్, రింగ్‌రోడ్డు,పంచాయతీరాజ్ రోడ్ల పనులను రద్దు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో 370 కేసులు ఉన్నాయి.. నా మీద కేసులు లేని పోలీసు స్టేషన్ లేదు.. కేసులకు భయపడే దీ లేదు.. ప్రభుత్వం పై పోరాటం ఆపే దీ లేదన్నారు. సిద్ధిపేటకు పూర్వ వైభవం తిరిగి రావాలన్నా, ఆగిపోయిన పనులు మళ్లీ రాకెట్ వేగంతో పూర్తి కావాలన్నా రేవంత్ రెడ్డిని ఎంత త్వరగా ఇంటికి పంపితే రాష్ట్రానికి పట్టిన శని పీడ అంత తొందరగా పోతుందని హరీష్ రావు అన్నారు.

కూటమి వల్ల సీఈసీ తొలగింపు సాధ్యమేనా



న్యూఢిల్లీ, నవంబర్ 6 :సీఈసీ అంటే కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్. ఇది రాజ్యాంగ బద్ధమైన పదవి. ఈపదవి నుంచి కేంద్రం కూడా.. జ్ఞానేశ్ కుమార్‌ని నేరుగా తొలగించలేదు. దీనికి రాజ్యాంగం సూచించిన విధంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించే విధానం అవలంభించాలి. అంటే రాజ్యాంగ పరమైన అంశాలను పాటిస్తూ ముందుకెళ్లాలి. ఇంతకు అవేమిటంటే..

సీఈసీ ని తొలగించే రాజ్యాంగ ప్రక్రియ..!

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం?లోక్‌సభలో తొలగింపు తీర్మానం ఆమోదం పొందాలి.రాజ్యసభలోనూ తీర్మానం ఆమోదం పొందాలి.నిరూపిత దుష్ప్రవర్తన లేదా అసమర్థత వంటి రాజ్యాంగపరమైన కారణాలు ఉండాలి.ప్రతి సభలో మొత్తం సభ్యుల మెజారిటీతో పాటు హాజరై ఓటు వేసిన సభ్యుల్లో కనీసం మూడింట రెండొంతుల మద్దతు అవసరం.సీఈసీని తొలగించాలంటే ముందు విపక్షానికి అవసరమైన సంఖ్యా బలం కావాలి. ప్రస్తుతం విపక్ష ఇండియా కూటమికి ఉన్న బలం.. తీర్మానంప్రవేశపెట్టడానికి సంతకాలకు సరిపోతాయి. కానీ.. సీఈసీ ని నిజంగా తొలగించాలంటే రెండు సభల్లోనూ ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతేకాదు..విచారణ కమిటీ ఆరోపణలను నిర్ధారించాలి.లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ అవసరమైన మెజారిటీ రావాలి.ఆమోదం ఒకే పార్లమెంటు సమావేశంలో రావాలి.అందువల్ల ప్రతిపక్షానికి ఉన్న ఎంపీల సంఖ్య మాత్రమే కాకుండా, అధికార పక్షం లేదా ఇతర పార్టీల ఎంపీల మద్దతు కూడా కీలకం.ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని 2026 మార్చిలో ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇచ్చారు.లోక్‌సభలో 130 మంది ఎంపీలు సంతకాలు చేశారు.రాజ్యసభలో 63 మంది ఎంపీలు సంతకాలు చేశారు.అయితే ఏప్రిల్ 6న లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ ఆ నోటీసులను స్వీకరించలేదు.

ఇండియా కూటమి ముందున్న అవకాశాలు..

ఎన్నికల సంఘం నిర్ణయాలపై పార్లమెంటులో చర్చకు ఒత్తిడి తీసుకు వచ్చే అవకాశం ఉంది.ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచడం..ఎన్నికల సంఘం పనితీరుపై న్యాయపరమైన పరిశీలన కోరడం, ఇదే సమయంలో ఇతర పార్టీల మద్దతు కోరడం చేయవచ్చు.

చట్టపరమైన అడ్డంకులు..!

లోక్‌సభ మొత్తం సభ్యుల్లో మెజారిటీ సాధించాలి. రాజ్యసభ మొత్తం సభ్యుల్లో మెజారిటీ అదనపు మద్దతు అవసరం..ఆ తరువాత రాష్ట్రపతి తొలగింపు ఉత్తర్వు జారీ చేస్తారు.కేవలం రాజకీయ విభేదాలతో సీఈసీని తొలగించడం సాధ్యం కాదు.ఎన్నికల సంఘం నిర్ణయాలు సంస్థాగత ప్రక్రియలో భాగమని ఎన్నికల సంఘం పేర్కొంది.గత నోటీసుల్లో ఆరోపణలకు అవసరమైన ప్రాథమిక ఆధారాలు లేవని స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ అభిప్రాయపడ్డారు.ఇండియా కూటమి సీఈసీ ని తొలగించాలంటే మూడు అడ్డంకులు దాటాలి.తొలగింపు నోటీసు ఆమోదం పొందాలి.ఆరోపణలు విచారణలో నిరూపించబడాలి.పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ రావాలి.సీఈసీ పై ఆరోపణలు నిరూపితమైతే, అధికార పక్షానికి పార్లమెంటులో మెజారిటీ ఉన్నప్పటికీ రాజ్యాంగపరమైన తొలగింపు ప్రక్రియను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

రంగంలోకి రామచంద్రరావు...



హైదరాబాద్, నవంబరు 7 : తెలంగాణ రాజకీయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు స్వయంగా రంగంలోకి దిగాలని భావించడం, దానికి అధిష్ఠానం ఆమోద ముద్ర వేయడం ఇప్పుడు కమలదళంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. త్వరలో అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. గతంలో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన అనుభవం రామచంద్రరావుకు ఉన్నప్పటికీ, రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉండి మళ్లీ ఈ ఎన్నికల్లో పోటీ చేయడం అత్యంత ప్రమాదకరమైన పొలిటికల్ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు.సాధారణంగా ఏ రాజకీయ పార్టీలోనైనా రాష్ట్ర అధ్యక్షుడు యావత్ రాష్ట్రంపై దృష్టి సారించి పార్టీని విజయతీరాలకు చేర్చాలి తప్ప, స్వయంగా ఒక నియోజకవర్గానికే పరిమితమై ప్రచారం చేసుకోవడం అరుదు. ఒకవేళ పట్టభద్రుల పోరులో ఫలితం తేడా వస్తే, వచ్చే మొదటి సవాలు రామచంద్రరావు నాయకత్వంపైనే. గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు ఎక్కువగా ఉండే ఈ నియోజకవర్గంలో ఓటమి ఎదురైతే రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సిన నైతిక బాధ్యత ఏర్పడుతుంది. ఈ విషయం తెలిసి కూడా ఆయన పోటీకి దిగుతున్నారా లేదా హైకమాండ్ ఆయనను ఈ రిస్కులోకి నెట్టిందా అనే సందేహాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పాలన, రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలపై దాడి చేయాల్సిన కీలక సమయంలో, రాష్ట్ర అధ్యక్షుడు ఒకే నియోజకవర్గంలో డివిజన్ల వారీగా తిరగడం బీజేపీ ప్రచార వేగానికి ఆటంకం కలిగిస్తుందనే ఆందోళన ఉంది. అయితే, రామచంద్రరావు వర్గం మాత్రం దీనిని విశ్వాస ప్రకటన గా చూస్తోంది. పట్టభద్రుల్లో బీజేపీకి ఉన్న తిరుగులేని ఇమేజ్‌ను, సీనియర్ న్యాయవాదిగా తనకున్న గుర్తింపును నమ్ముకుని, ఓటమి భయాన్ని పక్కనపెట్టి ఫ్రంట్ ఫుట్‌లో పోరాడుతున్నట్లు కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు.మరోవైపు, ఢిల్లీ వర్గాల్లోనూ, తెలంగాణ బీజేపీ వర్గాల్లోనూ ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. ఈ ఎన్నికల వేదికగా తెలంగాణ బీజేపీలో నాయకత్వ మార్పునకు పునాది పడుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుకూల ఫలితం రాకపోతే, ఆ సాకుతో రామచంద్రరావు స్థానంలో మళ్లీ మాస్ లీడర్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించేలా హైకమాండ్ పక్కా వ్యూహంతో ఉందనే ప్రచారం ఊపందుకుంది.గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తెలంగాణ బీజేపీలో కనబడిన అగ్రెసివ్ మార్క్, క్షేత్రస్థాయి శ్రేణుల్లో ఉన్న ఉత్సాహం ప్రస్తుతం కాస్త మందగించిందనే అభిప్రాయం కేడర్‌లో ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు గట్టి పోటీ ఇవ్వాలంటే మళ్లీ సంజయ్ వంటి దూకుడున్న నాయకుడే సరైన ఛాయిస్ అని భావిస్తున్న హైకమాండ్, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల ఆధారంగా తమ అసలు పొలిటికల్ గేమ్‌ను అమలు చేయవచ్చని భావిస్తున్నారు.రామచంద్రరావుకు ఈ ఎమ్మెల్సీ పోటీ ఒక రకంగా కత్తిమీద సాము లాంటిది. గెలిస్తే తన అధ్యక్ష పదవిని మరింత పటిష్టం చేసుకోవడమే కాకుండా పార్టీపై పట్టు సాధించవచ్చు, కానీ ఏమాత్రం తేడా వచ్చినా పదవిని కోల్పోవడంతో పాటు బండి సంజయ్ రీ-ఎంట్రీకి దారులు సుగమం చేసినవారవుతారు. మరి ఈ రిస్క్ పొలిటికల్ గేమ్‌లో రామచంద్రరావు గట్టెక్కుతారో లేక బీజేపీ హైకమాండ్ రాసిన స్క్రిప్ట్‌కే పరిమితమవుతారో తేలేందుకు కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

ఇందిరమ్మ ఇళ్లకు దివాళీ వెలుగులు



ఖమ్మం, నవంబరు 7 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీల్లో ప్రధానమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై క్షేత్రస్థాయిలో ఉన్న ప్రచార లోపాన్ని అధిగమించేందుకు రేవంత్ రెడ్డి మంత్రివర్గం సరికొత్త రాజకీయ వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పేరుతో ఒక వినూత్న ప్రజా సంబంధాల కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ అధికారికంగా నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఏకంగా 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, పండుగ వేళ ఆ ఇళ్లన్నింటిలో ప్రభుత్వం తరఫున వేడుకలు జరపాలని నిర్ణయించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించాలన్నది సర్కారు ప్రధాన ఉద్దేశం.వాస్తవానికి రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాల్లో తీవ్రమైన పబ్లిసిటీ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో విపక్షాలు చేస్తున్న విమర్శలు, ప్రజాక్షేత్రంలో ఉన్న భావనలు ప్రభుత్వాన్ని కొంత డిఫెన్స్‌లోకి నెట్టాయి. అసలు రాష్ట్రంలో ఒక్క పేదవాడికైనా ఇల్లు మంజూరైందా, లబ్ధిదారుల ఖాతాల్లోకి నయాపైస అయినా జమ అయిందా అన్న సందేహాలు సామాన్య ప్రజల్లో కూడా బలంగా నాటుకుపోయాయి. క్షేత్రస్థాయిలో వేలాది మంది నిర్మాణాలు చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారన్న విపక్షాల ప్రచారం హోరెత్తుతుండగా.. ప్రభుత్వం తమ శాఖాపరమైన ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో దారుణంగా విఫలమైందన్న విమర్శలు సొంత పార్టీ నేతల నుంచే వినిపించాయి.ఎవరికీ తెలియకుండానే నిశ్శబ్దంగా దాదాపు 2.25 లక్షల ఇళ్లను పూర్తి స్థాయి నిర్మాణానికి తీసుకువచ్చామని ప్రభుత్వం ఇప్పుడు అధికారిక గణాంకాలతో ముందుకొచ్చింది. కానీ ఎంత పని చేసినా దాన్ని మార్కెటింగ్ చేసుకోలేకపోతే రాజకీయంగా శూన్యమే మిగులుతుందన్న చేదు నిజాన్ని ఆలస్యంగానైనా గ్రహించిన క్యాబినెట్.. ఈ దీపావళి పండుగను తమ విజయాలను ప్రదర్శించే వేదికగా మార్చుకోవాలని నిర్ణయించింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాట తప్పిందని చేస్తున్న ప్రచారానికి చెక్ పెట్టాలంటే.. పూర్తయిన రెండున్నర లక్షల ఇళ్ల ముంగిట స్వయంగా దీపాలు వెలిగించి చూపించడమే సరైన సమాధానమని పాలక వర్గం భావిస్తోంది. పండుగ సంబరాల ముసుగులో విపక్షాల నోళ్లు మూయించేందుకు ఇదొక వ్యూహాత్మక అస్త్రంగా మారింది. ప్రచార నిర్వహణలో విఫలమైన మాట వాస్తవమే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో సాధించిన ఈ భారీ ఫలితాన్ని దీపావళి వేడుకల ద్వారా ప్రజల దృష్టికి తేవాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కలిసివచ్చే అవకాశాలున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా లబ్ధిదారుల గుమ్మంలో అడుగుపెట్టి వారితో మమేకమైతే.. ఆ దృశ్యాలు గ్రామీణ ప్రాంతాల్లో పథకం ఉనికిని, ప్రభుత్వ పనితీరును బలంగా చాటిచెబుతాయి. కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా, లబ్ధిదారుల ముఖాల్లోని సంతోషాన్ని ప్రత్యక్షంగా ప్రజలకు చూపించడం ద్వారా ఇప్పటివరకు ఉన్న అపోహలను తుడిచిపెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ అడుగు క్షేత్రస్థాయిలో ఏ మేరకు మైలేజ్ తెచ్చిపెడుతుందో వేచి చూడాలి

సయా లుక్‌తో శ్రద్ధా కపూర్




బీటౌన్స్ బ్యూటీ శ్రద్ధా కపూర్ తన సరికొత్త లుక్‌తో మరోసారి సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈథా' నుంచి తాజాగా విడుదలైన పోస్టర్లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

ముఖ్యంగా మహారాష్ట్ర సంప్రదాయ వస్త్రధారణలో శ్రద్ధా కనిపిస్తున్న తీరు అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ సినిమాలో శ్రద్ధా కపూర్ ప్రముఖ లావణి కళాకారిణి విఠాబాయి భౌ మాంగ్ నారాయణ్‌గావ్కర్ పాత్రలో నటిస్తుండగా.. తాజాగా విడుదలైన పోస్టర్లలో పింక్, క్రీమ్ కలర్ నవ్వారి చీర, భారీ బంగారు ఆభరణాలు, ప్రత్యేకమైన కిరీటంతో రాజసం ఉట్టిపడేలా కనిపిస్తున్నారు. ఆమె హావభావాలు, సంప్రదాయ నృత్య భంగిమలు పాత్రకు మరింత ప్రత్యేకతను తీసుకొస్తున్నాయి. కాగా..

లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా, నానా పటేకర్, మొహమ్మద్ జీషన్ అయ్యూబ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. డిసెంబర్ 4, 2026న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఇక రిలీజైన ఈ పోస్టర్లతో విఠాబాయి జీవితాన్ని శ్రద్ధా కపూర్ వెండితెరపై ఏ విధంగా ఆవిష్కరిస్తారో అనే అంచనాలు అభిమానుల్లో పెరిగాయి.

మరో పవర్‌ఫుల్ పాత్రలో కమల్.....



హీరో కమల్ హాసన్ ప్రస్తుతం ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ లెంగ్త్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్ఐ), టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో కమల్ హాసన్ గతంలో ఎన్నడూ చూడని రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి పవర్‌ఫుల్‌గా 'సండియార్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కమల్ హాసన్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో, గ్రే గడ్డంతో, చిన్నగా కత్తిరించిన హెయిర్‌స్టైల్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. డార్క్ బ్రౌన్ షర్ట్ ధరించిన ఆయన ఓ వాహనం కిటికీకి ఆనుకుని, నేరుగా ముందుకు చూస్తూ ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్‌తో కనిపిస్తున్నారు. ఆ వాహనంపై కనిపిస్తున్న రక్తపు మరకలు పోస్టర్‌కు రా అండ్ గ్రిట్టీ ఫీల్ తీసుకొచ్చాయి. వైలెన్స్ మధ్య సాగే ఓ బలమైన పాత్రలో కమల్ హాసన్ కనిపించబోతున్నారనే ఆసక్తిని ఈ పోస్టర్ కలిగిస్తోంది. 'సండియార్' అనే టైటిల్ వినగానే భయంలేని, ధైర్యవంతమైన, శక్తిమంతమైన వ్యక్తి గుర్తుకొస్తాడు. కమల్ హాసన్ పోషిస్తున్న పాత్రకు ఈ టైటిల్ పర్ఫెక్ట్. ఆయన ఇంటెన్స్ లుక్, ప్రశాంతంగా కనిపిస్తూనే భయపెట్టే బాడీ లాంగ్వేజ్.. రాజీ పడని మనస్తత్వం, బలమైన వ్యక్తిత్వం ఉన్న పాత్రను సూచిస్తున్నాయి. ఈ ఫస్ట్ లుక్‌తోనే సినిమాలోని పాత్రకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చారు.

దీంతో యాక్షన్‌తో నిండిన ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. 'సేతుపతి', 'చిత్తా' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. సునీల్ కె.ఎస్. సినిమాటోగ్రాఫర్, అన్బరివ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్, అమృతా రామ్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

ప్రతి అమ్మాయి కనెక్ట్ అవుతుంది!



హీరో నాగార్జున సమర్పణలో తెర కెక్కుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా పరిచయం అవు తుండగా, అనస్వర రాజన్ కథానాయికగా నటించారు. మహేష్ ఉప్పల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవు తుండగా, దర్శకుడు వెంకీ కుడుముల ఈ సినిమాతో నిర్మాతగా ప్రేక్షకులకు పరిచయం అవు తున్నారు. ఆయన కొత్తగా ప్రారం భించిన వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 13న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో యిన్ అనస్వర రాజన్ మీడియాతో సినిమా విశేషాలు పంచుకున్నారు. తెలుగులో నేను ఫస్ట్ సైన్ చేసిన సినిమా 'ఇట్లు అర్జున'. కాకపోతే 'ఛాంపియన్' సినిమా ఫస్ట్ రిలీజ్ అయింది. ఈ సినిమాలో చేసిన కీర్తి క్యారెక్టర్ చాలా యూత్‌ఫుల్ అండ్ ఇన్నోసెంట్‌గా ఉంటుంది. ప్రతి అమ్మాయి కీర్తి క్యారెక్టర్‌కు కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. కథ విన్న ప్పుడు కూడా నేను కీర్తి క్యారెక్టర్‌తో చాలా కనెక్ట్ అయ్యాను. ఈ క్యారెక్టర్‌ను ప్లే చేయడంలో చాలా ఎంజాయ్ చేశాను. ఇప్పటి వరకు నేను చేసిన క్యారెక్టర్స్ అన్నిట్లో ఇది చాలా డిఫరెంట్ క్యారెక్టర్. నాకు చాలా కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. ఇందులో హీరోకి మాటలు ఉండవు. నాకు కథలో ఆకర్షించిన విషయాల్లో ఇది ఒకటి. ఇలాంటి క్యారెక్టర్స్ చాలా అరుదుగా వస్తుం టాయి. ఈ సినిమా కోసం నేను, అనీష్ కలిసి వర్క్ షాప్స్ చేశాం. సీన్స్ను చాలా ప్రాక్టీస్ చేశాం. మా ఇద్దరి క్యారెక్టర్స్ అద్భుతంగా వచ్చాయి. అయితే ఇందులో మెయిన్ కోర్ ప్రేమకథ. అర్జున్ క్యారెక్టర్‌కు మాటలు రావు. తను ప్రేమను ఎలా ఎక్స్‌ప్రెస్ చేస్తాడు అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది.

హీరోగా ఎంట్రీ ఇస్తున్న విలన్!



టాలీవుడ్‌లో ఈమధ్య ట్రెండ్ మారుతోంది. ఒకప్పుడు విలన్ అంటే కేవలం హీరో చేతిలో దెబ్బలు తినడానికే అన్నట్లు ఉండేది. కానీ ఇప్పుడు హీరోకి దీటుగా.. కొన్నిసార్లు హీరోని డామినేట్ చేసే స్థాయిలో విలనిజం పండిస్తున్నారు మన యువ నటులు. సరిగ్గా ఇలాంటి కోవలోకే వస్తాడు వివేక్ చేపూరి. తెరపై తన మార్క్ యాక్టింగ్‌తో ప్రేక్షకులను అక్షరాలా భయపెట్టిన ఈ 'కల్ట్' యాక్టర్.. ఇప్పుడు ఏకంగా హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమై, ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాడు. 2019లో వచ్చిన 'ఫలక్‌నుమా దాస్' సినిమా యూత్‌లో ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అందులో మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌కు ఎదురు నిలబడి, తన అగ్రెసివ్ విలనిజంతో గట్టి పోటీ ఇచ్చిన 'రవి' క్యారెక్టర్‌ను ఎవరూ అంత ఈజీగా మర్చిపోలేరు. మళ్లీ సరిగ్గా ఏడేళ్ల తర్వాత అదే విశ్వక్ సేన్ దర్శకత్వంలో వచ్చిన 'కల్ట్' సినిమాలో వివేక్ మరోసారి రెచ్చిపోయాడు. ఇందులో 'ఇషాన్' అనే పాత్రలో వివేక్ చేపూరి నటన చూసి థియేటర్లలో జనాలు గడగడలాడిపోయారు. 'కల్ట్'లో ఇషాన్ గా వివేక్ పండించిన క్రూరత్వం, ఆ యాటిట్యూడ్‌కి కుర్రకారు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇతడి క్యారెక్టర్‌కు సంబంధించిన వీడియోలు, ఎడిట్ చేసిన మాస్ రీల్స్ విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేసినప్పటికీ, ఆడియన్స్ నుంచి ఈ రేంజ్‌లో వస్తున్న ప్రేమను చూసి వివేక్ ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.

తెరపై తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు కోసం పరితపించే వివేక్.. విలన్‌గా పీక్స్‌లో ఉన్నప్పుడే ఒక సంచలన నిర్ణయం తీసుకున్నాడు. దర్శకుడు టి. శరత్ చంద్ర తెరకెక్కిస్తున్న ఓ భారీ ప్రాజెక్టుతో ఏకంగా మెయిన్ లీడ్‌గా (హీరోగా) మారబోతున్నాడు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళంలోనూ ఏకకాలంలో ద్విభాషా (బైలింగ్వల్) చిత్రంగా ఇది రూపొందుతుండటం విశేషం. ప్రముఖ ఛాయాగ్రాహకుడు ప్రియేష్ గురుస్వామి ఈ చిత్రానికి కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. హీరోగా వివేక్ చేపూరి అసలు విస్వరూపం ఎలా ఉండబోతోందో చూపించేందుకు మేకర్స్ గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు. ఈ నవంబర్‌లోనే సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ గ్లింప్స్ లేదా టీజర్‌ను వదిలేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

హిలేరియస్ అడ్వెంచర్‌గా 'చంద్రయాన్' ట్రైలర్!



రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో "చంద్రయాన్" టైటిల్‌తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇందులో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్‌పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన "చంద్రయాన్" సినిమా ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు.

శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రపంచంలో కేవలం 5 దేశాలు మాత్రమే చంద్రుడి మీదకు తమ స్పేస్ క్రాఫ్ట్‌లను పంపగలిగాయి. అలాంటి ప్రయత్నం మందమర్రి అనే చిన్న గ్రామంలో లెక్కలు, ఎక్కాలు రాని నలుగురు కుర్రాళ్లు చేస్తే ఎంత ఫన్నీగా ఉంటుందో ట్రైలర్ ద్వారా చూపించారు మేకర్స్.

ఈ మేరకు ట్రైలర్ ఎలా ఉందో చూస్తే – గూగుల్ సాయంతో రాకెట్ తయారుచేసి చంద్రుడి మీదకు వెళ్లేందుకు నలుగురు కుర్రాళ్లు ప్రయత్నాలు ప్రారంభిస్తారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్‌పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన "చంద్రయాన్" సినిమా ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది.

ఈ దెబ్బతో ఊరంతా తమ వైపు, ప్రపంచమంతా తమ ఊరి వైపు చూడాలనుకుంటారు. ఆ రాకెట్‌లో ఇంధనం కోసం తవుడు, ఆ వాతావరణంలో బతుకుతుందో లేదో టెస్ట్ చేసేందుకు కోడిని అద్దెకు తీసుకొస్తారు. సైన్స్‌కే ట్విస్టులు ఇచ్చే ఈ సైంటిస్టులు చేసే రాకెట్ ప్రయోగం ఊరికి కీడుగా గ్రామస్థులు భావిస్తారు. ఈ క్రమంలో ఊరిలో హత్య కేసు ఉదంతం వెలుగులోకి రావడం, బాబా భాస్కర్ క్యారెక్టర్ ను పరిచయం చేయడం క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఇలా అనేక ఫన్నీ అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

రూమర్లకు 'రెస్ట్ ఇన్ పీస్' చెప్పిన కోన వెంకట్!



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'కాకా' చుట్టూ గత కొద్ది రోజులుగా సాగుతున్న రూమర్లకు ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ ఊహించని రీతిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. సంక్రాంతి రేసు నుంచి సినిమా తప్పుకుంటోందంటూ వస్తున్న తప్పుడు వార్తలను కొట్టిపారేస్తూ ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. 'రూమర్లకు, ఫేక్ న్యూస్‌కు రెస్ట్ ఇన్ పీస్.. మిమ్మల్ని నిరాశపరుస్తున్నందుకు సారీ.. సంక్రాంతికి 'కాకా' జనవరి 13నే ల్యాండ్ అవుతున్నాడు' అంటూ ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. గత కొన్ని రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఓ ఆసక్తికర ప్రచారం నడిచింది.

చిరంజీవి నటిస్తున్న మరో భారీ చిత్రం 'విశ్వంభర' జనవరి 13న బాక్సాఫీస్ వద్దకు వచ్చే అవకాశాలున్నాయని, అందుకే ముందుగా అదే తేదీని లాక్ చేసుకున్న 'కాకా' సినిమా వెనక్కి తగ్గుతుందని కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. మెగా వర్సెస్ మెగా క్లాష్ ఉండకూడదనే ఉద్దేశంతో విడుదల వాయిదా పడుతుందని వార్తలు అల్లారు. అయితే వాటన్నింటిని చెక్ పెడుతూ.. చెప్పిన ముహూర్తానికే, అంటే జనవరి 13నే పక్కాగా థియేటర్లలోకి అడుగుపెడుతున్నామని కోన వెంకట్ స్పష్టం చేశారు. 'సంక్రాంతికి కాకా వస్తున్నాడు.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
RNI. No: TELTEL/2023/85598, CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com